ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..



'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | శనివారం | 04.07.2026 | సంపుటి : 2 | సంచిక : 03 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

## రాష్ట్రంలో అద్దంలాంటి రోడ్ల నిర్మాణం

ఈ జులైలో 10 ప్యాకేజీల పనులు ప్రారంభం

నల్లగొండ-మహబూబ్ నగర్ రోడ్డు పనుల్లో వేగం పెంచాలి

6న కరీంనగర్ జిల్లా హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన

ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



02

## నేడు, రేపు భారీ వర్ష సూచన

'ఆరెంజ్' హెచ్చరికలు జారీ



హైదరాబాద్, జూలై 3 : రాష్ట్రంలో శని, ఆదివారాల్లో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ జిల్లాలకు 'ఆరెంజ్' రంగు హెచ్చరికలు జారీ చేసింది. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్,

-మిగతా 2 లో..



## రైతుభరోసా నిధుల విడుదలలో వేగం

నాలుగు రోజుల్లో రూ.6,590.37 కోట్ల జమ

02



## అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి

యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు

అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.

న్యూఢిల్లీ,జూలై 3 : 'పవిత్రమైన అమ-ర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం మంచు లింగంని నేరుగా దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయ పూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచ

-మిగతా 2 లో..

## ₹ బిఆర్ఎస్ అప్పులు 8,21,651 కోట్లు

అనేక సంస్థలకు వేలకోట్ల బకాయిలు పెట్టిన ఘనులు

చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు

నాటి అప్పులు, తప్పులపై కెసిఆర్ స్పందించాలి

హరీష్ రావు అబద్దాలను కట్టిపెడితే మంచిది

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్ట్రాంగ్ వార్నింగ్

గత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన భారీ అప్పులు, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రస్తుతం లేనిపోని అబద్దాలను ప్రచారం చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన తప్పులను తక్కువ చేసి చూపించేందుకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. మంత్రిగా పనిచేసిన విషయాన్ని మరిచిపోయి హరీశ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు.



హైదరాబాద్, జూలై 3 : రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన లెక్కలను బయటపెట్టిన ఆయన.. గత పాలకులు రాష్ట్రంపై సుమారు రూ. 8,21,651 కోట్ల అప్పులు , బకాయిల భారాన్ని మిగిల్చారని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం ఎంతో శ్రమతో క్రమబద్ధీకరిస్తోందని వెల్లడించారు. అలాగే రెసిడెన్షియల్ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన భోజనం, బట్టలు , కనీస సౌకర్యాలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ ప్రభుత్వం వచ్చాకే విద్యా సంస్థల్లోని వసతులను మెరుగుపరిచి సంక్షేమానికి పెద్దపీట వేసిందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను డిప్యూటీ సీఎం తీవ్రంగా

-మిగతా 2 లో..





## పోలీసు శాఖలో 5,000 ఖాళీలు

ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

కానిస్టేబుల్ నుంచి ఎస్సై వరకు భారీ నియామకాలకు ఉత్తర్వులు

త్వరలో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్

హైదరాబాద్, జూలై 3 : రాష్ట్రంలో నిరుద్యోగులకు శుభవార్త. తెలంగాణ పోలీసు శాఖలో భారీ సంఖ్యలో ఉద్యోగ నియామకాలకు రాష్ట్ర ప్రభు త్వం ఆమోదం తెలిపింది. పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 5 వేల పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయిస్తూ జీఓ ఎంఎస్ నం. 78 జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీసు నియా మక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) ద్వారా నియామక ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నయక్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం పోలీసు శాఖలో ఉన్న ఖాళీలు, శాఖ అవసరాలు, ఆర్థిక భారం తదితర అంశాలను సమీక్షించిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నియామకాలకు అవసరమైన స్థానిక కేడర్ వారీగా ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, విద్యార్హతలు తదితర వివరాలను పోలీసు నియామక మండలికి వెంటనే అందజేయాలని హోం శాఖ, డీజీపీ కార్యాలయాన్ని ఆదేశించింది.

## అప్పులపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం

తొమ్మిదిన్నరేళ్లలో తీసుకున్న రుణాలు రూ.4.17 లక్షల కోట్లే

మంత్రి జూపల్లి కీష్ణారావుకు హరీష్ రావు లేఖ

హైదరాబాద్, జూలై 3 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు... ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో చేసిన ప్రసంగాల వీడియోలు, ఆర్బీఐ గణాంకాలు సహా పలు ఆధారాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు వెల్లడించారు. హరీశ్‌రావు లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తీసుకున్న రుణాలు, ప్రభుత్వ హామీతో తీసుకున్న రుణాలు కలిపి మొత్తం రూ.4.17 లక్షల కోట్లేనని అసెంబ్లీలో వివరించినట్లు తెలిపారు. ఆ లెక్కలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని అప్పుడే ప్రకటించానని గుర్తు చేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రూ.1,77,058 కోట్ల అప్పు చేసినట్లు మంత్రి జూపల్లి తన లేఖలో పేర్కొన్నారని తెలిపారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 2026 జూన్ 30 నాటికి రాష్ట్ర

- మిగతా 2 లో..





## రండి అప్పుల సంగతి తేలుస్తా

అబద్దాలతో ప్రజలను మభ్య పెట్టలేరు

మరోమారు హరీష్ రావుకు జూపల్లి సవాల్

హైదరాబాద్, జూలై 3 : తెలంగాణ అప్పులపై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చకు మరోమారు సిద్ధమయ్యారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని.. సాయంత్రం 5 గంటలకు వస్తానని బీఆర్ఎస్ నేతలకు మరోసారి సవాల్ విసిరారు. 'మీరు సిద్ధమైతే ముందే చెప్పండి. నా లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తా. మీ లెక్కలు తప్పు అయితే

-మిగతా 2 లో..

## కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల నటన అద్భుతం

కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా



హైదరాబాద్, జూలై 3 : కాంగ్రెస్, భారాస నేతల నటన అద్భుతంగా ఉందని, బిగ్‌బాస్ షోను తలపిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ప్రజలు మీ నాటకాలు చూసి నవ్వుకుంటున్నారు. అబద్దాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే రెండు పార్టీలూ అర్హత సాధిస్తాయని అన్నారు. గురుకులాల టెండర్లు, తెలంగాణ అప్పులతోపాటు అవినీతి, అక్రమాలపైనా చర్చిద్దాం రండి. మా పార్టీ రాష్ట్ర

-మిగతా 2 లో..

# బిఆర్ఎస్ అప్పులు అక్షరాలా రూ.8,21,651 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఖండించారు. బొగ్గు గనుల కేటాయింపులు, ఉత్పత్తికి సంబంధించి గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి సంస్థను నష్టాల్లోకి నెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం సింగరేణిని కాపాడుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని వివరించారు. సింగరేణిలో జరిగిన గత ప్రభుత్వ కాలపు అక్రమ వ్యవహారాలపై తాము విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్లు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో, బయటా అబద్ధపు ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించిన ఆయన, దమ్ముంటే తమతో నేరుగా బహిరంగ చర్చకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులపై కేసీఆర్ స్పందించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో మొత్తం అప్పు రూ. 8.21 లక్షల కోట్లు అని.. మొత్తం అప్పుల్లో గత ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పులు అన్నీ వాస్తవాలు కాదా.. వీటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పులను తక్కువ చేసి చూపేందుకే కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి మండిపడ్డారు. మంత్రిగా పనిచేశానని మర్చిపోయి మరీ హరీశ్ మాట్లాడుతున్నారని.. అనేక అంశాలపై అబద్ధాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తేవాలన్నారు. బీఆర్ఎస్ నేతల అబద్ధాలు ప్రజల్లోకి



వెళ్లకూడదన్నారు. సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాల పునాదులపై పదేళ్ళ పరిపాలించారని.. బీఆర్ఎస్ చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విరుచుకుపడ్డారు. అప్పుల భారం రాష్ట్రంపై వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు అనేక విషయాలపై అబద్ధాలు చెబుతున్నారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకురావాలి. బీఆర్ఎస్ నేతలు చెప్పే అవాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకూడదు. సోషల్ మీడియా వ్యవస్థల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అబద్ధాల పునాదులపై పదేళ్లపాటు పరిపాలన చేశారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే ప్రభుత్వంపై పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీ హయాంలో చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నాం. 2014 నుంచి 2023 వరకు అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా? వివిధ మార్గాల ద్వారా మీరు చేసిన అప్పు రూ. 8.21లక్షల కోట్లు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారు? అప్పుల అంశంపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని తగ్గాం. మేం వచ్చాక రూ. 2.08లక్షల కోట్లు చెల్లించాం. 10 శాతం వడ్డీకి కూడా మీరు అప్పులు తెచ్చారు. కట్టాల్సిన వడ్డీని రూ. 34 వేల కోట్ల నుంచి రూ. 11వేల కోట్లకు తగ్గించాం. బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. సింగరేణిపై ప్రతిరోజూ అబద్ధాలు చెబుతున్నారు' అని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు. ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనలను, భద్రతా సూచనలను పూర్తిగా అంకితభావంతో పాటించాలని సూచించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులను కొనుగోలుకు కేటాయించాలి. ఇది అక్కడి కుటుంబాలకు, యువతకు ఉపాధినిస్తుందన్నారు. రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అమ్మ పేరిట ఒక మొక్క ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. దేశమే ప్రథమమనే భావనతో, మన బాధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని ఆకాంక్షించారు.

## అప్పులపై తప్పుడు ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)



ప్రభుత్వం చేసిన అప్పు రూ. 1,86,067 కోట్లుగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మరోవైపు, 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రభుత్వం చేసిన ఎఫ్ఆర్‌బీఎం, ఇతర అన్ని రకాల రుణాలు కలిపి రూ. 3,47,294 కోట్లుగా ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ తమ లెక్కలను మార్చడం లేదని, కాంగ్రెస్ మాత్రం సందర్భానుసారంగా అప్పుల అంకెలను మారుస్తోందని విమర్శించారు. తమ అంచనాల ప్రకారం వివిధ మార్గాల ద్వారా ప్రస్తుత ప్రభుత్వం సుమారు రూ. 4.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ అంశానికి సంబంధించిన అసెంబ్లీ వీడియోలు, ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు, ఆర్బీఐ అధికారిక గణాంకాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరిన హరీశ్‌రావు, ఇకనైనా అప్పుల అంశంలో తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.




## రండి అప్పులు సంగతి తేలుస్తా

(మొదటిపేజీ తరువాయి)

రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్తున్న లెక్కలు తప్పని మీడియాతో చెప్పమనండి. ఖబడ్దార్.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్.. పాలమూరు పౌరుషమా? కల్వకుంట్ల పౌరుషమా చూసుకుందాం' అంటూ ఛాలెంజ్ చేశారు. 'నేనెక్కడికీ పారిపోలేదు. పారిపోయే లక్షణం నాకు లేదు. నా మాటకు కట్టుబడి ఉన్నాను. ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్‌లాగా కేటీఆర్, హరీశ్ వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర అప్పు రూ. 3,17,015 కోట్ల అని ఒకసారి, రూ. 3,85,045 కోట్లు అని మరోసారి అసెంబ్లీలో కేటీఆర్ అన్నారు. రాష్ట్ర అప్పు రూ. 4, 26,499 కోట్లు అని ఒకసారి.. రూ. 4,17, 496 కోట్లు అని మరోసారి హరీశ్ అసెంబ్లీలో అన్నారు. కేసీఆర్ దిగిపోయే సరికి రూ. 8,21, 651 కోట్ల అప్పు ఉంది. నేను చెప్తున్న లెక్కలు తప్పు అయితే మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని తాజాగా సవాల్ చేశారు. కార్పొరేషన్ ద్వారా తెచ్చిన అప్పులను కేటీఆర్, హరీశ్ ఎందుకు చెప్పడం లేదు. మిషన్ భగీరథ కోసం తెచ్చిన అప్పులు ప్రజలు కడతారా?' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అబద్దాలు చెప్పే వాడిని కాదని మంత్రి తెలిపారు. ఆత్మ గౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకునే వాడినని తెలిపారు. రాజకీయాల నుంచి వ్యాపారంలోకి రాలేదని.. వ్యాపారం చేసి రాజకీయాల్లోకి వచ్చినట్లు జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల నటన అద్భుతం

(మొదటిపేజీ తరువాయి)



అధ్యక్షుడు రామచందర్‌రావు ఆధ్వర్యంలో తేదీ, సమయం, వేదిక నిర్ణయిస్తాం. కాంగ్రెస్, భారాస పాలనా వైఫల్యాలను ప్రజల ముందుంచేందుకు మేం సిద్ధం. మోదీ ప్రభుత్వం తెలంగాణ అభి వృద్ధికి ఖర్చు చేసిన నిధులు, అందించిన సంక్షేమ కార్యక్రమాలపైనా చర్చిద్దాం. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని సంజయ్ అన్నారు.

## కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

### మీడియా, కమ్యూనికేషన్ నోడల్ అధికారులతో భేటీ

### తెలంగాణ సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారుల హాజరు

**న్యూఢిల్లీ,జూలై3 :** భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ఒకరోజు మీడియా / కమ్యూనికేషన్ నోడల్ అధికారుల జాతీయ సదస్సులో తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖకు చెందిన జిల్లా పౌర సంబంధాల అధికారులు, మీడియా నోడల్ అధికారులు, సోషల్ మీడియా నోడల్ అధికారులు పాల్గొన్నారు. దేశంలోని 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 240 మంది జిల్లా పౌర సంబంధాల అధికారులు హాజరైన ఈ సదస్సులో ఎన్నికల నిర్వహణలో కమ్యూనికేషన్ పాత్ర, మీడియా నిర్వహణ, ఎన్నికల చట్టాలు, డిజిటల్ సాంకేతికత వినియోగం, తప్పుడు ప్రచారాల నియంత్రణ, సోషల్ మీడియా సవాళ్లు, ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేసే విధానాలపై ఎన్నికల సంఘం అధికారులు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికల నిర్వహణలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసే అధికారిక సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేయడంతో పాటు తప్పుడు ప్రచారం, అపోహలు, దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత కమ్యూనికేషన్ అధికారులపై ఉందని పేర్కొన్నారు. ÷-రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ పక్రియ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, పౌరసత్వ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగా అర్హులైన భారతీయ పౌరుల పేర్లు మాత్రమే ఓటరు జాబితాలో ఉండేలా ఈ పక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల పక్రియపై ప్రజల్లో అపోహలు తొలగించి వాస్తవాలను చేరవేయడంలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర అత్యంత ముఖ్యమని చెప్పారు. సదస్సులో ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ఫారం-17సీ, ఆర్టికల్-324 కింద ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలు, ఎన్నికల ప్రచార నిబంధనలు, పెయిడ్ న్యూస్ నియంత్రణ, సోషల్ మీడియా, కృత్రిమ మేధ వల్ల ఎదురవుతున్న సవాళు ,, వాటిని ఎదుర్కొనే వ్యూహాలపై ఎన్నికల సంఘం సీనియర్ అధికారులు ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చారు. అలాగే, ఎన్నికల సంఘం రూపొందించిన సమగ్ర డిజిటల్ వేదిక ద్వారా ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణ, పోలింగ్ కేంద్రాల సమాచారం, అభ్యర్థుల అఫిడవిట్లు, ఎన్నికల ఫలితాలు తదితర సేవలను ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన విధానాన్ని వివరించారు. ప్రతి స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడు వినియోగించేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. సదస్సులో ఎన్నికల కమ్యూనికేషన్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించే విధానాలు, మీడియాతో సమన్వయం, సోషల్ మీడియా వినియోగం, ప్రజల్లో ఎన్నికలపై అవగాహన పెంపు, తప్పుడు ప్రచారాన్ని వేగంగా ఖండించే వ్యూహాలపై విస్తృతంగా చర్చించి పలు సూచనలు చేశారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారుల కార్యాలయం నుంచి అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎన్. శంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రసన్నరాజ్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి సంయుక్త సంచాలకులు యు. వెంకటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనరేట్ పౌర సంబంధాల అధికారులు ఎం. కిరణ్మయి, ఏ. వనజతో పాటు మీనాక్షి, ఇందిర, అనిల్, విశ్వేశ్ తదితర జిల్లా ప్రజా సంబంధాల అధికారులు పాల్గొన్నారు.



## నేడు, రేపు భారీ వర్ష సూచన

(మొదటిపేజీ తరువాయి)

జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వాయవ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతం, ఒడిశా-పశ్చిమబెంగాల్ తీరాల్లో అల్పపీడనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ సూచించింది. మరోవైపు శుక్రవారం రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. ఈ నెల రెండో వారంలో మాత్రమే రాష్ట్ర వ్యాప్తంగా సాధారణం కన్నా అధికంగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 3 నుంచి 9 వరకు సాధారణ స్థాయిలో వర్షాలు కురుస్తాయని, 10 నుంచి 16 మధ్య సాధారణం కన్నా ఎక్కువగా వానలు పడతాయని పేర్కొంది.

## రైతుభరోసా నిధుల విడుదలలో వేగం

### నాలుగు రోజుల్లో రూ.6,590.37 కోట్ల జమ

**హైదరాబాద్,జూలై3 :** రైతు భరోసా పథకం అమలులో తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. కేవలం నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ. 6,590.37 కోట్ల రైతు భరోసా నిధులను జమ చేసి రికార్డు సృష్టించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. నేడు నాలుగో విడతలో 4 నుంచి 5 ఎకరాల భూమి ఉన్న రైతులకు రూ. 1,188 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఈ విడతలో 4.41 లక్షల మంది రైతులు లబ్ధి పొందినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటివరకు మొత్తం 65.76 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా సాయం జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన అర్హులైన రైతులకు కూడా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు భరోసా నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి తెలిపారు.

## రాష్ట్రంలో అద్దంలాంటి రోడ్ల నిర్మాణం

**హైదరాబాద్,జూలై3:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో 'న భూతో న భవిష్యతి' రీతిలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణానికి సంకల్పించామని,అందులో భాగంగా జూన్ 28న నల్లగొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర హ్యామ్ రోడ్ల పనుల పైలాన్ ఆవిష్కరణ చేసుకుని,పనులు ప్రారంభించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో ఏ మూలన చూసిన నాణ్యమైన ఆర్ అండ్ బి డబుల్ రోడ్లు వినియోగంలోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. 'మంచి రోడ్డు - ప్రగతికి సూచిక' అని తాను బలంగా విశ్వసిస్తానని, దీంతో పల్లె పట్టణాలకు కనెక్టివిటీ పెరిగి,గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తె స్థానికంగానే ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పనుల పురోగతిపై డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్ అండ్ బి లోని విభాగాల వారీగా పనుల పురోగతిపై కూలంకషంగా చర్చించిన మంత్రి,చేపట్టిన కీలక పనులు ఏ దశల్లో ఉన్నాయో అధికారులను ఆరా తీశారు. మొదటి ఫేజ్ లో సుమారు 13వేల కోట్లతో 6092 కి.మీ రోడ్ల పనులు 34 ప్యాకేజీల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనుండగా..ఈ జూలై నెలలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజ్-2లో సుమారు 155 కోట్ల అంచనా వ్యయంతో 42కి.మీ పొడవుగల నల్లగొండ-మహబూబ్ నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని,అయినా.. వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో రోడ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణం కోసం నిష్ణాతులై, నిరంతరం ఫీల్డ్ లో ఉండే ఇంజనీర్లను



ఎంపిక చేసి,ప్యాకేజీల వారిగా పనుల బాధ్యతలు అప్పజెప్పాలని,పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయించడం చీఫ్ ఇంజనీర్ల బాధ్యతేనని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల 6న కరీంనగర్ జిల్లాలో చేపట్టే హ్యామ్, రోడ్ల పనులకు ఆ జిల్లా మంత్రులు,స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధిత ఏర్పాట్లు చూడాలని సి.ఈ లు బి.వి రావు,వసంత్ నాయక్ లను మంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు. ÷ూజేంద్ర నగర్ లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హై కోర్టు భవనం,జడ్జిల నివాస సముదాయ భవనాల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని,నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 16 శాతం పనులు పూర్తయ్యాయని సి.ఈ లు రాజేశ్వర్ రెడ్డి, నర్సింగ్ రావు వివరించగా....మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు జరగాలని,అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి, నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో వేగం పెంచాలని మంత్రి వారిని ఆదేశించారు. అక్కడ ఆర్ అండ్ బి తరుపున నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న ఇంజనీర్ల సంఖ్యను పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అట్లాగే ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పనుల్లో ఇంకా వేగం పెరగాలని,ఇది కూడా డిసెంబర్ 2027 వరకు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. సనత్ నగర్ టిమ్స్ ప్రారంభానికి సిద్ధం అయిందని,అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ,వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణ పనులు వేగవంతం చేసి అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టుల్లో టెక్నికల్ నాలెడ్జ్ ఉండి,మనసుపెట్టి పనిచేసే కమిట్మెంట్ ఉన్న ఇంజనీర్లను నియమించాలనీ మంత్రి సూచించారు. ఈ వారం నుండే నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో ఆకస్మిక సైట్ విజిట్స్ చేస్తానని..పనుల పురోగతిలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తన దృష్టికి వస్తే, ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోనని,కఠిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు. బాసర,భద్రాచలం ఆలయ నిర్మాణ పనుల పురోగతి,గోదావరి పుష్కరాల కోసం ఆర్ అండ్ బి ఏర్పాట్లపై మంత్రి ఆరా తీశారు..సంబంధిత ఆయా శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఆర్ అండ్ బి తరుపున నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకొని పని చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఈఎన్సి జయ భారతి,అన్ని విభాగాల సి.ఈ లు.. బి.వి రావు,రాజేశ్వర్ రెడ్డి,ధర్మారెడ్డి, వసంత్ నాయక్,వనజ,రాజేందర్,నర్సింగ్ రావు పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు పాల్గొన్నారు.

# సవాళ్లు విసరడం..పారిపోవడం

### రేవంత్, మంత్రుల తీరే ఇందుకు నిదర్శనం
### మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్,జూలై 3 :** ప్రతిపక్ష పార్టీలకు సవాల్ విసరడం, పారిపోవడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. మంత్రులు కూడా అదేతరహాలో ఉన్నారని మండిపడ్డారు. ఇందుకు తాజాగా మంత్రులు వ్యవహరించిన తీరే నిదర్శనమని అన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ ఎస్ నాయకులకు సవాల్ విసిరి తోక ముడిచిన కాంగ్రెస్ మంత్రుల డొల్లతనం బయట పడిందని , మంత్రులు పోలీసులను అడ్డంపెట్టుకొని పారిపోయారని ఆరోపించారు. గతంలో సవాల్ చేసిన రేవంత్ రెడ్డి ప్రెస్‌క్లబ్‌ను కల్లు కాంపౌండ్‌తో పోల్చి పారిపోగా , కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి మూడు నెలల్లోనే మల్కాజీగిరి ఎంపీగా పోటీ చేశారని ఎద్దేవా చేశారు. ఉద్యమం జరిగినప్పుడు గుర్తుకు రాని గన్‌పార్క్ కాంగ్రెస్ మంత్రులకు ఇప్పుడు గుర్తొచ్చిందా ? అంటు ప్రశ్నించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై మంత్రులు అహంకారంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వద్ద సమాధానం లేనప్పుడే ప్రతిపక్ష నాయకులను అరెస్టులు చేస్తారని మండిపడ్డారు. ఏదేని సమస్యపై రేవంత్ రెడ్డి డిఫెన్స్ లో పడగానే బండి సంజయ్ తెరపైకి వస్తాడని, బండి సంజయ్ డిఫెన్స్ లో పడగానే ముఖ్యమంత్రి తెరపైకి వస్తాడని విమర్శించారు. అమృత్ టెండర్‌లో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కుంభకోణంపై కేంద్రానికి లేఖ రాస్తే చర్యలు ఎందుకు తీసుకోలేదని వేముల ప్రశ్నించారు. బొగ్గు కుంభకోణం జరిగిందని కేంద్రానికి లేఖ రాస్తే ఇంత వరకు చర్యలే లేవని అన్నారు. కేటీఆర్ హరీష్ రావు సెగకు మంత్రులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారని, ఇక ముందు ఇలాంటివి చాలా జరుగుతాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలతో సింగరేణిలో బొగ్గు మాయం పై మంత్రి భట్టి విజిలెన్స్ విచారణకు ఆదేశించారని వెల్లడించారు. అప్పులపై, గురుకులాల్లో జరిగిన అవినీతిపై చర్చకు స్వయంగా సవాల్ విసిరిన కాంగ్రెస్ మంత్రులు, చర్చకు హాజరు కాకుండా వెనక్కి పారిపోవడం వారి పిరికితనానికి నిదర్శనం అన్నారు. చర్చ కోసం తెలంగాణ భవన్‌కు చేరుకున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను, ఘన్ పార్క్‌కు బయలుదేరిన మాజీ మంత్రి హరీష్ రావును, అలాగే ఇతర ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్‌లను వందలాది మంది పోలీసులతో అడ్డుకోవడం, నిర్బంధించడం, అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానపరచడమేనని అన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, కక్షసాధింపు పాలనకు పరాకాష్ట అన్నారు. అప్పులపై నిజంగా చర్చించే ధైర్యం ఉంటే పూర్తి స్థాయిలో అసెంబ్లీలో చర్చ నిర్వహించాలి. చర్చ కు కేసీఆర్ అవసరం లేదు. ఎంతమంది మంత్రులు వచ్చినా కేటీఆర్, హరీష్ రావు లెక్కలతో సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. చర్చకు రమ్మని సవాల్ విసిరి, చర్చకు వచ్చిన ప్రతిపక్ష నాయకులను పోలీసులతో అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ మంత్రులు భయపడి పారిపోయారనే విషయం స్పష్టమైంది. సవాల్ విసరడం, చివరకు తోక ముడవడం కాంగ్రెస్ మంత్రులకు అలవాటుగా మారింది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సతీమణిని అఘామేఘాల మీద ప్రాధాన్యత లేని శాఖలకు బదిలీ చేయడం ప్రభుత్వం ఎంత భయపడుతోందో వెల్లడిస్తోంది. ఇవన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని అన్నారు. తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పిన మంత్రి జూపల్లి కృష్ణారావు భవన్ కి రాకుండా ఘన్ పార్క్ కి రమ్మంటే అక్కడికి కుడా వద్దకు వెళ్లేందుకు బయలుదేరిన కేటీఆర్‌ను కూడా పోలీసులతో అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని బయటపెడుతోంది. బిఆర్ఎస్ నాయకులు పై అక్రమ కేసులు, అరెస్టులు, నిర్బంధాలతో భయపెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎన్ని నిర్బంధాలు చేసినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆపేది లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో పూర్తిగా విఫలమయ్యారు. రాష్ట్ర సమస్యలను పరిష్కరించడంలో చేతులెత్తేసి, రాజకీయ కక్షసాధింపులకే పరిమితమయ్యారు. కాంగ్రెస్ మంత్రులు ప్రజా పాలనను గాలికి వదిలేసి అవినీతిలో మునిగిపోయారని వేముల విమర్శలు గుప్పించారు.



## సర్ ప్రక్రియ సజావుగా సాగాలి

### ఖైరతాబాద్, రాజేంద్రనగర్‌లలో పరిశీలన

**హైదరాబాద్, జూలై 3 :** రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్లు రెడ్డి శుక్రవారం నాడు ఖైరతాబాద్, రాజెంద్రనగర్ నియోజకవర్గలలో పర్యటించి ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్ నెం. 211, బంజారాహిల్స్, పరిధిలోని ఫిల్మ్ నగర్ పోలింగ్ స్టేషన్ నం. 184ను సందర్శించారు. అదేవిదంగా రాజేంద్రనగర్ నియోజకవర్గలోని కోకాపేట, మంచిరేవుల ప్రాంతాలలో గల పోలింగ్ క్రేందాలను సందర్శించి, ప్రక్రియ పురోగతిని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చేసే ఓటర్ల గణన పురోగతి తెలుసుకున్నారు. అలాగే, శాశ్వతంగా తరలివెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓటర్ల ధృవీకరణ, పరిష్కారం కోసం సరైన ప్రక్రియను అనుసరించాలని బిఎల్‌వో లను ఆదేశించారు. ఖచ్చితంగా ఇంటింటికీ వెళ్లి గణన పత్రాలను స్వయంగా ఓటర్లకు అందచేయాలని ఆయన ఆదేశించారు. అలాగే, యాప్ ద్వారా శాశ్వతంగా నివాసం మారినవారు, మరణించినవారు, డూప్లికేట్ ఓటర్ల వివరాల పరిశీలన, తొలగింపు ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టాలని ఆదేశించారు. ఓటర్ల ఆన్ లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని ఈ విషయంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు.

## మైనార్టీ క్రిష్టియన్స్ కోసం పోర్టల్ ప్రారంభం

**హైదరాబాద్, జూలై 3 :** రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రారంభించింది. ఈ మేరకు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఓబీఎంఎంఎస్ పోర్టల్‌ను ప్రారంభించారు. అర్హులైన క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కుట్టు మిషన్, పెట్టీ బిజినెస్, బైక్, ఈ-బైక్ వంటి స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జులై 3 నుంచి జులై 18 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తామని వెల్లడించారు. హిళలు, యువత స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండేలా క్షఃఓఓ÷ూ వ్యవస్థను రూపొందించినట్లు మంత్రి తెలిపారు.

# ఉస్మానియా వైద్యుల అరుదైన చికిత్స

### అవయవ మార్పిడిలో రికార్డు సృష్టి
### వైద్యులను సన్మినించిన మంత్రి దామోదర




**హైదరాబాద్, జూలై 3 :** నగరంలోని ఉస్మానియా ఆస్పత్రిలో 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో వైద్యులను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్ర వైద్య రంగంలో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. దేశ వైద్య చరిత్రలోనే అత్యంత అరుదైన ఘనతను ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి సొంతం చేసుకుంది. అవయవదానం అనేది మహాదానం, ఈ సందేశాన్ని సమాజంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.' అని అన్నారు. ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రిలో తొలిసారిగా 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు అత్యంత విజయవంతంగా పూర్తి చేశారు. సుమారు 36 గంటల పాటు ఎంతో క్లిష్టంగా సాగిన ఈ శస్త్రచికిత్సను విజయవంతం చేసిన డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని వైద్య బృందాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యుల ప్రతిభను, వారి అంకితభావాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అవయవదానం అనేది మహాదానమని, ఈ సందేశాన్ని సమాజంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం గట్టి సంకల్పంతో పనిచేస్తోందని మంత్రి దామోదర స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే వైద్య రంగ బలోపేతానికి పెద్దపీట వేస్తూ గత రెండున్నరేళ్ల కాలంలోనే 15 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు. అంతేకాకుండా, తాజాగా మరో 6,238 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలను నిరంతరం విస్తరిస్తున్నామని, ఉస్మానియా వైద్యుల ఘనతతో తెలంగాణ వైద్య రంగానికి జాతీయ స్థాయిలో గొప్ప గుర్తింపు లభించిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు.



## రైలుకిందపడి దంపతుల ఆత్మహత్య

**హైదరాబాద్,జూలై3 :** మేడ్చల్ జిల్లాలోని ఘట్కేసర్ సమీపంలో రైలు కిందపడి దంపతులు మృతిచెందిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. గురువారం రాత్రి ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. మృతులు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన రవికుమార్, శిరీషగా గుర్తించారు. ఘట్కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఘట్కేసర్- బీబీనగర్ రైల్వే మార్గంలో రైలు కిందపడి దంపతులు మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే జీఆర్‌పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరి మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దంపతుల మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. రవికుమార్, శిరీష మృతితో పాపయ్యపేట గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



## యువతి అనుమానాస్పద మృతి

### యువతితో కలిసి వచ్చిన ఫారూఖ్ అనే వ్యక్తి అరెస్ట్

**హైదరాబాద్,జూలై3 :** నగరంలోని లంగర్‌హౌస్ పరిధిలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. మృతురాలిని రేణుక(26)గా పోలీసులు గుర్తించారు. హోటల్ గ్రాండ్ లాడ్జ్‌లో సదరు యువతి ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో కనిపించినట్లు తెలిపారు. ఫారూఖ్ అనే వ్యక్తితో కలిసి రేణుక హోటల్‌లో గది బుక్ చేసుకుంది. అనంతరం ఫారూఖ్ బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి రేణుక ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. అయితే.. ఇది ఆత్మహత్య కాదని, తమ కుమార్తెను హత్య చేశారని యువతి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న లంగర్‌హౌస్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఫారూఖ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. యువతిది హత్యా, ఆత్మహత్యా అనే దానిపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన లంగర్‌హౌస్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎండీ లైన్స్ వద్ద ఉన్న లాడ్జిలో రేణుక (26) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి ఘటన చోటు చేసుకుంది. అల్వాల్‌కు చెందిన రేణుకకు గోల్కొండ ప్రాంతానికి చెందిన ఫారుక్ (34)తో పరిచయం ఉంది. ఈ క్రమంలో ఇద్దరూ నిన్న రాత్రి హోటల్‌లో గదిని (రూమ్ నం. 1611) బుక్ చేసుకున్నారు. తాను కొద్దిసేపు బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి రేణుక ఉరివేసుకుని కనిపించిందని ఫారుక్ పోలీసులకు తెలిపాడు. అయితే, రేణుక కుటుంబ సభ్యులు ఇది ఆత్మహత్య కాదు.. హత్యేనని ఆరోపిస్తూ ఫారుక్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ ఆధారాల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయని పోలీసులు తెలిపారు.

## తెలంగాణ పోలీసు శాఖలో 5వేల ఉద్యోగాల భర్తీ

**హైదరాబాద్:** నిరుద్యోగ యువతకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పోలీసు శాఖలో 5,000 ఉద్యోగాల భర్తీకి ఆమోదం తెలిపింది. ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు చేయడంతో భర్తీ ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో త్వరలోనే పోస్టుల భర్తీకి సంబంధించిన అర్హతలు, వయోపరిమితులు, ఎంపిక విధానం, పరీక్షల షెడ్యూల్‌తో కూడిన పూర్తిస్థాయి నోటిఫికేషన్‌ను ప్రకటించే అవకాశం ఉంది. 10 విభాగాల్లో కలిపి మొత్తంగా 5,000 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయనుంది. అత్యధికంగా పోలీసు కానిస్టేబుల్ (సివిల్) విభాగంలో 3,697 పోస్టులు, ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ విభాగంలో 1,052 పోస్టులను భర్తీ చేయనున్నారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ (సివిల్)-148, సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్)-14, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (టీజీఎస్పీ) - 12, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఆర్ సీపీఎల్) - 3, అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎఫ్‌పీబీ) - 23, పోలీసు కానిస్టేబుల్ (ఎస్ఏఆర్ సీపీఎల్) - 24, పోలీసు కానిస్టేబుల్ (డ్రైవర్-పీటీవో) - 20, మెకానిక్ పీటీవో - 7 పోస్టులను భర్తీ చేయనుంది.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**మహబూబాబాద్,జూలై3 :** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని టీక్యా తండా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. తొర్రూర్ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు కొరిపెల్లి గ్రామానికి చెందిన ఎర్ర శ్రీనుగా గుర్తించారు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## స్వాధీనం చేసుకున్న విమానం వేలం

### దేశంలో తొలిసారిగా ఈడీ సంచలన నిర్ణయం

**హైదరాబాద్, జూలై 3 :** దేశంలోనే తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్ 800 విమానాన్ని విక్రయించేందుకు ఈ నెల 1న ఎంఎస్‌టీసీ ద్వారా ఆక్షన్ నిర్వహించగా.. రూ.3 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం. హాకర్ 800 విమానం అనేది అంతకుముందు ఫాల్కన్ పోంజీ కేసు ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు చెందినది. అయితే అమర్‌దీప్ నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మోసానికి పాల్పడినట్టు ఈడీ తేల్చింది. దర్యాప్తులో భాగంగా ఈ విమానాన్ని గత మార్చి 7న ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత.. చట్టపరమైన ప్రక్రియ ద్వారా, పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ అనుమతితో దీనిని ఈ-వేలంలో రూ.3 కోట్లకు విక్రయించారు. ఈ సొమ్మును బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నారు. కాగా.. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ అవ్వగా, దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఈడీ తెలిపింది. అయితే.. ఈడీ స్వాధీనం చేసుకున్న విమానాన్ని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో విక్రయించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఆస్తుల విక్రయ ప్రక్రియలో పారదర్శకత, పోటీ వాతావరణం కల్పించడం సహా ప్రభుత్వ ఆదాయాన్ని మరింత పెంచే దిశగా ఈ విధానం ఉపయుక్తమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

## భూముల వేలంలో 50కోట్ల కుంభకోణం

### భద్రకాళి గుడి వద్ద బిఆర్ఎస్ నేతల హంగామా

**వరంగల్,జూలై3 :** వరంగల్ భద్రకాళి ఆలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ భూముల వేలంలో రూ.50కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ నాయకుల ఆరోపించారు. దీనిపై ప్రస్తుత కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి భద్రకాళి గుడిలో ప్రమాణం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. సవాల్ స్వీకరించిన మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు తడిబట్టలతో ప్రమాణం చేసేందుకు ఆలయానికి వస్తుండగా వారిని పోలీసులు అరెస్ట్ చేయడం ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. దీనిపై వెంటనే విచారణ చేయాలన్నారు.

## విదేశీ పేరున్నంత మాత్రాన హిందువు కాదంటే ఎలా?

### మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు

**చెన్నై,జూలై3 :** మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. విదేశీ పేరు, పౌరసత్వం ఉన్నంత మాత్రాన హిందూ గుర్తింపును నిరాకరించలేమని తేల్చి చెప్పింది. హిందూ మతాన్ని స్వీకరించడానికి ఎలాంటి సర్టిఫికెట్లు, ప్రత్యేక వేడుకలు అవసరం లేదని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ, అమెరికా పౌరురాలు లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్‌ను హిందూ భక్తురాలిగానే పరిగణించాలని ఆదేశించింది. లారా ఫ్రాన్సెస్‌ను 'అమెరికన్ క్రైస్తవ మహిళ'గా పేర్కొంటూ తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విదేశీయులు అనగానే క్రైస్తవులని అంచనా వేయడం తప్పు అని తెలిపింది. మనఃస్ఫూర్తిగా మతాన్ని ఆచరిస్తూ, హిందూ జీవన విధానాన్ని పాటిస్తే వారు హిందువులే అవుతారని స్పష్టం చేసింది. ఈ మేరకు తంజావూరు ఆలయంలో హిందూ మహిళలకు ఉండే అన్ని పూజా, దర్శన హక్కులు అమెరికన్ మహిళకు కూడా వర్తిస్తాయని తేల్చి చెప్పింది. ఆగమ శాస్త్రాలు, ఆలయ నిబంధనలకు లోబడి విదేశీ హిందూ భక్తురాలికి సమాన హక్కులు కల్పించాలని మద్రాస్ హైకోర్టు హుకుం జారీ చేసింది.

## తెలంగాణ ఉద్యమకారులతో విస్తృత సంప్రదింపులు

### 6న భేటీకి ఓయూ జెఎసి విద్యార్థి నాయకులకు ఆహ్వానం

**హైదరాబాద్, జూలై 3 :** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారి సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫార్సులు చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈ నెల 6వ తేదీ నుంచి ఉద్యమకారులతో విస్తృత స్థాయి సంప్రదింపుల కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. 6న జరిగే తొలి సమావేశంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి జేఏసీ నాయకులతో కమిటీ సమావేశం కానుంది. ఈ సమావేశానికి ఆనాడు ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన విద్యార్థి నాయకుడిగా మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం. మీరు పాల్గొని, ఉద్యమకారుల సంక్షేమం కొరకు తీసుకోవాల్సిన విధానాలపై మీ సూచనలను ఇవ్వగలరని విజ్ఞప్తి చేస్తున్నట్లు కె. కేశవరావు,పొన్నం ప్రభాకర్, ఎమ్. కోదండరామ్,అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డిలు ఒక ప్రకటనలో కోరారు.



## మంత్రి కొండా సురేఖతో పిసిసిఎఫ్ వినయ్ కుమార్ భేటీ

- అటవీ సంపద పరిరక్షణ, పచ్చదనంపై కార్యాచరణ
- అమలు చేయాలని నూతన పిసిసిఎఫ్ కు దిశానిర్దేశం
- మాజీ పిసిసిఎఫ్ సువర్ణను చీరతో సత్కరించిన మంత్రి

**హైదరాబాద్, జూలై 3 :** రాష్ట్ర అటవీదళాల నూతన ప్రధాన సంరక్షణాధికారి (పిసిసిఎఫ్)గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కుమార్ శుక్రవారం అటవీ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖను జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అటవీ సంపద పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, సామాజిక అటవీ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించడం, ప్రభుత్వ లక్ష్యాలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలపై వీరిరువురు సమగ్రంగా చర్చించారు. అటవీ సంపదను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సురేఖ పిసిసిఎఫ్ కు సూచించారు. అటవీ శాఖ కార్యక్రమాల అమలులో సాంకేతికత వినియోగం, అటవీ రక్షణ చర్యల బలోపేతం, పచ్చదనం పెంపుదల, అటవీ అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని మంత్రి వినయ్ కుమార్ కు దిశానిర్దేశర చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల సాధనకు అటవీ శాఖ పూర్తి నిబద్ధతతో పనిచేస్తుందని పీసీసీఎఫ్ వినయ్ కుమార్ ఈ సందర్భంగా మంత్రికి హామీ ఇచ్చారు. అడవుల సంరక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ, అటవీ సంపదను కాపాడుతున్న అటవీ అధికారులు, సిబ్బందికి ప్రతి ఏటా అవార్డులు, నగదు ప్రోత్సహాకాలు అందించేలా చర్యలు చేపట్టినందుకు గాను పిసిసిఎఫ్ వినయ్ కుమార్ మంత్రి సురేఖ గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అటవీ రంగంలో ఈ చర్య మైలురాయిగా నిలుస్తుందని, అటవీ సిబ్బంది సేవలకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవానికి ఇది నిదర్శనమని ఆయన అన్నారు. పదవీ విరమణ తర్వాత తనను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ పిసిసిఎఫ్ సువర్ణను మంత్రి కొండా సురేఖ చీరతో సత్కరించి, అభినందించారు. అటవీ శాఖకు ఆమె అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. పదవీవిరమానంతర జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

# పార్లమెంట్ సమావేశాలపై కసరత్తు!



**ఈ నెలాఖరులో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే మరోమారు మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను పెట్టే యోచనలో కేంద్రం ఉంది. అయితే గత సమావేశాల్లో ఈ రెండు బిల్లులు వీగిపోయాయి. అయినా కేంద్రం తన పట్టును విడవకుండా ముందుకు సాగాలన్న యోచన లో ఉంది. ఈ బిల్లులు పాస్ కావాలంటే మూడోవంతు మెజార్టీ అవసరం. అందుకుత తగ్గ కసరత్తు చేస్తున్నట్లుగా ఉంది. ఇదే సందర్భంలో అన్ని పార్టీలతో చర్చించే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. అందరి అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగాలన్న ఆనవాయితీని బిజెపి ఎప్పుడో విడనాడింది.**

గతంలో సమస్యలు లేదా బిల్లులకు సంబంధించి ముందస్తు అఖిపలక్ష సమావేశాలు జరిగేవి. కానీ అలాంటి ఆనవాయితీని బిజెపి పాటించడం లేదు. దాదాపు 12 ఏళ్లుగా ఏకాభిప్రాయ సాధనలో మోడీ ఏనాడూ ప్రయత్నం చేయలేదు. ఇకపోతే ఏం జరుగుతుందో కూడా ప్రతిపక్షాల ఊహకు కూడా అందడం లేదు. ఈ క్రమంలో రేపటి బిల్లులను ఎప్పుడు, ఎలా ప్రవేశ పెడతారన్నది కేవలం మోడీ, అమిత్ షాలకు మాత్రమే తెలిసి ఉంటుంది. కేంద్రమంత్రులు, బిజెపి నేతలకు కూడా వీటిపై సమాచారం ఉండకపోవచ్చు. ఇలా గోప్యత పాటించడం వల్ల వచ్చే లాభం ఏమిటన్నది కూడా వారికే తెలుసు. ఇకపోతే పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కావచ్చని చూచాయగా తెలుస్తోంది. ఇదే సమయంలో సమావేశాలకు ముందుగానే మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ ఉంటుందని సమాచారం వస్తోంది. దీంతో ఎవరు ఉంటారు, ఎవరు పోతారన్న లెక్కల్లో ఎంపిలు ఉన్నారు. ఇది కూడా మోడీ, అమిత్ షాల కనుసన్నల్లోనే జరుగుతుందనడంలో సందేహం లేదు. అందుకే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంటే దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందుగానే ఈ మార్పులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, కొన్ని కీలక మంత్రిత్వ శాఖల్లో కొత్త నాయకులకు చోటు కల్పించడమే లక్ష్యంగా ప్రధాని మోడీ వ్యూహరచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వరుసగా ప్రధాని మోడీ, అమిత్ షాలు వేర్వేరుగా రాష్ట్రపతిని కలవడం ఈ వార్తలకు బలం చేకూరింది.

బీజేపీ సంస్థాగత బృందంలో కూడా నితిన్ నబిన్ నేతృత్వంలో సమూల మార్పులు చేసేందుకు పార్టీ అగ్ర నాయకత్వం జాబితాను ఖరారు చేసింది. ప్రభుత్వంతో పాటు పార్టీలో కూడా సమర్థులైన వారికి బాధ్యతలు అప్పగించే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వ పనితీరును మరింత వేగవంతం చేసేందుకు పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండబోతున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విద్యాశాఖ బాధ్యతలు అప్పగించి, ఆ స్థానంలో శక్తికాంత దాస్‌ను తీసుకురావచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అనురాగ్ ఠాకూర్ తిరిగి మంత్రివర్గంలోకి వచ్చే అవకాశం బలంగా ఉంది. పరీక్షల లీకేజీలు, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని ప్రధాని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేందర ప్రధాన్‌ను తప్పించే అవకాశాలు కూడా లేకపోలేదు. మరోవైపు పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రా వంటి మంత్రులు పార్టీ సంస్థాగత బాధ్యతల్లోకి వెళ్లగా, జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టు స్థానాల్లో కొత్త ముఖాలను కేబినెట్లోకి తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్,పంజాబ్ రాష్ట్రాల నుంచి మరికొందరు సమర్థ నేతలను మంత్రివర్గం లోకి తీసుకునే అవకాశం ఉంది. బెంగాల్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో అక్కడి ఎంపీలకు ప్రాధాన్యత దక్కవచ్చు. శివసేన రెబెల్ వర్గం నుంచి ఒకరిద్దరికి, ముఖ్యంగా శ్రీకాంత్ షిండేకు అవకాశం లభించవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆప్ రెబెల్ ఎంపీలు రాఘవ్ చద్దా లేదా అశోక్ మిట్టల్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. రానున్న రోజుల్లో జరగనున్న కీలక రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఈ మార్పులు దేశ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ త్వరలో కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉండడంతో ఉభయ తెలుగురాష్ట్రాల్లోనూ మార్పులు ఉండవచ్చు.ముఖ్యంగా తెలంగాణలో ఉన్న ఇద్దరిలో మార్పు ఉంటుందా అన్న చర్చకూడా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌కు మరో కేంద్రమంత్రి పదవి దక్కనుందనే వార్తలు వస్తున్నాయి.

ఇప్పటికే టిడిపి నుంచి ఇద్దరు, బిజెపి నుంచి ఒక్కరు కేబినేట్‌లో ఉన్నారు. ఇప్పటికే ఏపీ నుండి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, మరో అదనపు పదవిని టీడీపీకి కేటాయించే యోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి బలంగా ఉండటంతో, కేంద్రంలో మరిన్ని అవకాశాలు దక్కేలా చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నారు. ఒకవేళ మూడో పదవి వస్తే, అది టీడీపీ ఖాతాలోకే వెళ్తుందా లేక జనసేనకు వెళుతుందా, లేక బిజెపికే వెళుతుండా అన్నది చూడాలి. పరిణామం రాష్ట్ర అభివృద్ధికి, కేంద్రంతో సత్సంబంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పార్టీ నేతలు ఆశిస్తున్నారు. మరోవైపు, సామాజిక సమీకరణాలను బట్టి నిర్ణయం తీసుకుంటే పరిస్థితి మారవచ్చు. మహిళా కోటాలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేరును కూడా అధిష్టానం పరిశీలించే అవకాశం ఉంది. కొత్త వారికి అవకాశం ఇస్తారా లేదా అనుభవజ్ఞుల వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. బిజెపికే ఇస్తే మహిళా ఎంపి పురంధేశ్వరికి ఛాన్స్ దక్కవచ్చని అనుకుంటున్నారు. ఒకవేళ ప్రాంతీయ సమతుల్యత పాటిస్తే, ఉత్తరాంధ్ర లేదా రాయలసీమ ప్రాంతాలకు ప్రాధాన్యత పెరిగే ఛాన్స్ ఉంది. మంత్రి పదవి దక్కితే ఏపీకి కేంద్ర నిధులు, ప్రాజెక్టుల విషయంలో మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని పార్టీ భావిస్తోంది. మొత్తంగా ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలు, మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లుల వ్యవహారంతో పాటు మంత్రివర్గ విస్తరణ అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. రానున్న రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. బిజెపి వ్యూహం ఎలా ఉందన్నది కూడా తెలియనుంది.

# ప్రమాదంలో తక్షశిల పురావస్తు సంపద

**ఆందోళన వ్యక్తం చేసిన యునెస్కో**

**అక్కడ చేపట్టిన పనులను ఆపాలని పాక్‌కు ఆదేశం**



**ఇస్లామాబాద్, జూలై 3 :** అవిభక్త భారతదేశంలో తక్షశిల ఓ విశ్వవిద్యాలయం. ఆర్య చాణక్యుడు అక్కడ ఏర్పటు చేసిన విశ్విద్యాలయం అప్పట్లోనే ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. అయితే భారత్‌పై విదేశీ దండయాత్రల్లో దీనిని కూడా ధ్వంసం చేశారు. చివరు దేశ విభజనలో అది పాక్ భూభాగంలోకి వెళ్లింది. ఇప్పుడు అక్కడి పురావస్తు సంపద ప్రమాదంలో పడిందని యునెస్కో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పాకిస్థాన్‌లోని ప్రాచీన పురావస్తు క్షేత్రం తక్షశిలలో ప్రభుత్వం చేపట్టిన సంరక్షణ పనులపై యునెస్కో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న ఈ చారిత్రక కట్టడాల్లో చేపట్టిన పనులు అసలు నిర్మాణాల ప్రామాణికత, చారిత్రక విలువను దెబ్బతీసేలా ఉన్నాయని హెచ్చరించింది. ఈ మేరకు పనులను వెంటనే నిలిపివేయకపోతే తక్షశిలను 'వరల్డ్ హెరిటేజ్ ఇన్ డేంజర్' జాబితాలో చేర్చడంతో పాటు, అవసరమైతే ప్రపంచ వారసత్వ హోదానూ రద్దు చేస్తామని పాకిస్థాన్ అధికారులను హెచ్చరించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువడ్డాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని రావల్పిండి జిల్లాలో ఉన్న తక్షశిల.. దక్షిణాసియాలోనే అత్యంత ప్రాచీన బౌద్ధ విద్యా కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. మెసోలిథిక్ కాలానికి చెందిన గుహ, నాలుగు ప్రాచీన పట్టణాల అవశేషాలు, బౌద్ధ విహారాలు, మసీదు, మదరసా వంటి నిర్మాణాలతో ఈ ప్రాంతం విశేష చారిత్రక ప్రాధాన్యం కలిగి ఉంది. భారత ఉపఖండంలోని పట్టణ నాగరికత అభివృద్ధికి తక్షశిల ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోందని యునెస్కో పేర్కొంటోంది. ఈ ఏడాది మార్చిలో ఓ సందర్శకుడు తక్షశిలలో జరుగుతున్న పనులకు సంబంధించిన ఫొటోలు, వివరాలను ప్యారిస్‌లోని పాకిస్థాన్ శాశ్వత ప్రతినిధి కార్యాలయానికి పంపించాడు. అసలు రాతి గోడలను తొలగించి కొత్త నిర్మాణాలు చేపట్టడం, పాత గోడల ఎత్తు పెంచడం వంటి చర్యలు చారిత్రక కట్టడాల ప్రామాణికతకు విఘాతం కలిగిస్తున్నాయని ఆయన ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులతో జూన్ 12న యునెస్కో ప్రతినిధులు, పాకిస్థాన్ పురావస్తు శాఖ, జాతీయ వారసత్వ మంత్రిత్వ శాఖ అధికారులు కలిసి తక్షశిల మ్యూజియాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మొహ్రా మొరాడు, సిర్కాప్ ప్రాంతాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన పూర్తి సాంకేతిక పత్రాలను పంజాబ్ పురావస్తు శాఖ సమర్పించలేకపోయినట్లు సమాచారం. అంతేకాకుండా ప్రపంచ వారసత్వ కట్టడాల గోడలను సిమెంట్‌తో నిర్మించడం, పురాతన గోడల స్థానంలో కొత్త రాతి నిర్మాణాలు చేపట్టడం, గోడల ఎత్తును పెంచడం వంటి చర్యలు యునెస్కో నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. పాత రాళ్లకు, కొత్త నిర్మాణ సామగ్రికి మధ్య స్పష్టమైన తేడా కనిపిస్తోందని తెలిపారు. ప్రపంచ వారసత్వ కట్టడాల్లో ఇటువంటి మార్పులు చేయడం తీవ్ర ఉల్లంఘనగా పరిగణిస్తామని యునెస్కో స్పష్టం చేసింది. దీంతో తక్షశిల ప్రపంచ వారసత్వ హోదా ప్రమాదంలో పడే అవకాశం ఉందని, ఇదే పరిస్థితి కొనసాగితే 'డేంజర్ లిస్ట్'లో చేర్చడంతో పాటు అవసరమైతే జాబితా నుంచి పూర్తిగా తొలగించే అవకాశ మూ ఉందని హెచ్చరించింది. ప్రస్తుతం మరో 24 చారిత్రక ప్రాంతాలకు ప్రపంచ వారసత్వ హోదా పొందేందుకు పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాలపైనా ఈ వివాదం ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ ఆరోపణలను పంజాబ్ పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ మాలిక్ జహీర్ అబ్బాస్ ఖండించారు. ప్రస్తుతం జరుగుతున్నవి 'పునర్నిర్మాణ పనులు కావు.. సంరక్షణ చర్యలు మాత్రమే' అని ఆయన స్పష్టం చేశారు. శిథిలావస్థకు చేరుతున్న నిర్మాణాలను మరింత దెబ్బతినకుండా కాపాడటం, వాటి అసలు స్వరూపాన్ని సంరక్షించడమే లక్ష్యమని చెప్పారు. ఈ మేరకు చేపట్టిన పనులను వెనక్కి తీసుకోవాల్సిన అవసరం లేదని పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ మాలిక్ జహీర్ అబ్బాస్ పేర్కొన్నారు.

# నేడు అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం

**జూలై 4న 13 రాష్ట్రాల సమాహారంగా అమెరికా ఏర్పాటు**




**వాషింగ్టన్, జూలై 3 :** అగ్రరాజ్యం అమెరికా జూలై4న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటోంది. అమెరికాకు 1776లో స్వాతంత్ర్యం లభించింది. మరి అంతకుముందు అది ఒకే దేశంగా ఉండేది కాదు! బ్రిటిష్ పాలనలోని 13 వలస రాజ్యాల సమాహారంగా ఉన్న ప్రాంతం తదుపరి ప్రత్యేక దేశంగా, అమెరికాగా అవతరించింది. 'ప్రాతినిధ్యం లేనిదే పన్ను లేదు' అనే నినాదంతో ఈ రాజ్యాలన్నీ బ్రిటిష్ పాలనకు ఎదురు తిరిగాయి. చివరకు 1776 జులై 4న పదమూడు వలస రాజ్యాలు స్వాతంత్ర్యం ప్రకటించుకొని.. అన్నీ కలిసి అమెరికాగా అవతరించాయి. అమెరికాలో ప్రస్తుతమున్న రాష్ట్రాల సంఖ్య 50. కానీ స్వాతంత్ర్యం వచ్చేనాటికి అట్లాంటిక్ తీరంలోని 13 రాష్ట్రాలు మాత్రమే అందులో భాగంగా ఉండేవి. అనేక కొనుగోళ్లు, యుద్ధాలు, ఒప్పందాలతో మిగతా రాష్ట్రాలను వాషింగ్టన్ దక్కించుకుంది. 1803లో ఫ్రాన్స్ నుంచి లూసియానాను కొనుగోలు చేసింది. దాంతో దేశ భూభాగం దాదాపు రెట్టింపైంది. 1819లో స్పెయిన్ నుంచి ఫ్లోరిడా దక్కింది. టెక్సాస్ తొలుత స్వతంత్ర దేశంగా ఏర్పడి.. 1845లో అమెరికాలో విలీనమైంది. మెక్సికోతో యుద్ధం తర్వాత అమెరికాలో కాలిఫోర్నియా, ఆరిజోనా, నెవాడా, ఉటా చేరాయి. 1867లో రష్యా నుంచి అలాస్కాను కొనుగోలు చేశారు. 1959లో హవాయి 50వ రాష్ట్రంగా మారింది. భౌగోళిక విస్తరణెళి అమెరికా ఆర్థిక, సైనిక శక్తికి పునాది అయింది. దేశానికి విస్తారమైన వ్యవసాయ భూములు, ఖనిజ సంపదతో పాటు రెండు మహాసముద్రాలపై ఆధిపత్యాన్ని కట్టబెట్టింది. అమెరికా 1861-65 మధ్య అంతర్యుద్ధంతో అతలాకుతలమైంది. బానిసత్వమే అందుకు ప్రధాన కారణం. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయం ఆఫ్రికన్ బానిసల శ్రమపై ఆధారపడగా.. ఉత్తర రాష్ట్రాలు పారిశ్రామికీకరణ వైపు వెళ్లి బానిసత్వాన్ని వ్యతిరేకించాయి. ఈ విభేదాలు దేశాన్ని రెండు శిబిరాలుగా చీల్చాయి. అబ్రహం లింకన్ అధ్యక్షుడిగా ఎన్నికవడంతో 11 దక్షిణ రాష్ట్రాల విడిపోయి ప్రత్యేక సమాఖ్యను ఏర్పాటు చేశాయి. అంతర్యుద్ధంలో ఆరు లక్షల మందికిపైగా మరణించారు. 1863లో లింకన్ బానిసల విముక్తి ప్రకటన జారీ చేయడంతో అంతర్యుద్ధం.. స్వేచ్ఛ కోసం పోరాటంగా మారింది. ఉత్తర రాష్ట్రాల విజయంతో బానిసత్వం రద్దయింది. అయితే జాతి వివక్ష వెంటనే అంతరించిపోలేదు. సమాన హక్కుల కోసం నల్లజాతీయులు మరో శతాబ్దం పాటు పోరాడాల్సి వచ్చింది. అయినప్పటికీ అంతర్యుద్ధమే అమెరికాను శాశ్వతంగా ఏకీకృత దేశంగా నిలబెట్టిందని చెప్పొచ్చు. అందుకే చరిత్రకారులు దీనిని అమెరికా రెండో జననంగా పిలుస్తారు. ఇలా దేశం విస్తరించడానికి అప్పటి నాయకుల కృషి ఎనలేనిది. ఇప్పుడు ట్రంప్ కూడా రాజ్య విస్తరణ కాంక్షను వదులుకోవడం లేదు.

# పశ్చిమాసియా సంక్షోభంలో రహస్యాలు

**ఇరాన్ నేతలను మట్టుపెట్టాలనుకున్న ఇజ్రాయిల్**

**అమెరికా రంగంలోకి దిగడంతో తప్పిన ముప్పు**

**న్యూయార్క్ టైమ్ కథనం వెల్లడి**



**వాషింగ్టన్, జూలై 3 :** పశ్చిమాసియా సంక్షోభంలో సరికొత్త అంతర్జాతీయ రహస్యాలు వెలుగులోకి వచ్చాయి. ఇవి.. అమెరికా, ఇజ్రాయెల్ మైత్రి బీటలు వారిందని చెప్పేందుకు మరింత ఊతమిచ్చేలా ఉన్నాయి. ఇరాన్ అగ్రనేతలు, శాంతి చర్చల ప్రతినిధులైన విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘెర్ గాలిబాఫ్ లపై ఇజ్రాయెల్ వేసిన 'హత్య ప్రణాళిక' ను అమెరికా ముందే పసిగట్టి, ఇరాన్‌ను అప్రమత్తం చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్'ఈ రక్షణ రహస్యాలను బహిర్గతం చేసింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీని ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హతమార్చిన తర్వాత, ఇరాన్ ఉన్నత స్థాయి నాయకత్వాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని ఇజ్రాయెల్ వ్యూహం రచించింది. అయితే, ఏప్రిల్ 8న జరిగిన మొదటి తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత అమెరికాతో అణు, శాంతి చర్చలు జరపడానికి ఇరాన్ తరఫున అరాగ్చీ, గాలిబాఫ్ బాధ్యతలు చేపట్టారు. ఇది ఇజ్రాయెల్‌కు ససేమిరా ఇష్టం లేదు. న్యూయార్క్ టైమ్స్ నివేదిక ప్రకారం.. ఏప్రిల్ 12న ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌తో చర్చలు ముగించుకుని తిరిగి ఇరాన్‌కు విమానంలో ప్రయాణమయ్యారు. గాలిబాఫ్ ప్రయాణిస్తున్న విమానాన్ని కూల్చివేయడానికి ఇజ్రాయెల్‌కు చెందిన రెండు ఫైటర్ జెట్స్ ఇరాక్ మీదుగా ఇరాన్ వైమానిక పరిధిలోకి ప్రవేశించాయి. ఈ నిఘా సమాచారాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ ముందే గుర్తించి, ప్రాంతీయ దేశాల (పాకిస్థాన్, ఖతార్) మధ్యవర్తుల ద్వారా ఇరాన్ ప్రభుత్వానికి అత్యవసర హెచ్చరికలు పంపింది. సమాచారం అందిన వెంటనే ఇరాన్ రక్షణ దళాలు గాలిబాఫ్ విమానాన్ని టెహ్రాన్‌కు వెళ్లకుండా దారి మళ్లించి, ఈశాన్య ప్రాంతంలోని 'మషద్' నగరంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయించాయి. ఆ తర్వాత గాలిబాఫ్ రోడ్డు మార్గంలో సురక్షితంగా టెహ్రాన్ చేరుకున్నారు. ఇరాన్‌తో శాంతి చర్చలు జరుపుతున్న సమయంలో ఆ దేశ ప్రధాన దౌత్యవేత్తలను ఇజ్రాయెల్ హతమరిస్తే, చర్చలు పూర్తిగా దారి తప్పి, అమెరికా కూడా నేరుగా ఇరాన్‌తో పెద్ద ఎత్తున యుద్ధంలోకి దిగాల్సి వస్తుందని వాషింగ్టన్ భయపడింది. 'వారినీ చంపేస్తే ఇక మనం శాంతి చర్చలు జరపటానికి ఇరాన్‌లో ఒక్క నేత కూడా మిగలడు' అని పాకిస్థాన్ దౌత్యవేత్తలు కూడా అమెరికాకు స్పష్టం చేశారు. దీంతో అమెరికా స్వయంగా రంగంలోకి దిగి ఇజ్రాయెల్‌ను వెనక్కి తగ్గాలని ఆదేశించిందని కూడా సదరు నివేదిక వెల్లడించింది. ఇదిలా ఉంటే, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడం ఇదే మొదటిసారి కాదు. జూన్ 2025లో జరిగిన 12 రోజుల యుద్ధంలో, అలాగే ఈ ఏడాది జరిగిన ఘర్షణల్లో ఇరాన్ భూగర్భ బంకర్లపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల శిథిలాల నుంచి గాలిబాఫ్ రెండుసార్లు ప్రాణాలతో బయటపడ్డారు.ఇక, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు మధ్య ఇటీవల కాలంలో తీవ్రమైన విభేదాలు రావడానికి ఈ ఘటనే పునాది అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతేకాదు, ఇజ్రాయెల్‌కు ఇష్టం లేకపోయినప్పటికీ, అమెరికా.. ఇరాన్‌తో విడిగా చర్చలు జరిపి 14 అంశాల అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవడం అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



# కుకీ దొంగలించాడంటూ.. ఉద్యోగి తొలగింపు

**అమెరికాలో ఫోర్డ్ కంపెనీ ఘరానా నిర్ణయం**

**తప్పని తేలడంతో ఉద్యోగంలో తిరిగి ఆహ్వానం**

**నమ్మకం లేనిచోట పనిచేయలేనన్న ఉద్యోగి**

**వాషింగ్టన్, జూలై 3 :** చాక్లెట్ కుకీ దొంగలించాడనే ఆరోపణలపై ప్రముఖ వాహన తయారీ సంస్థ ఫోర్డ్ రూ. 1.9 కోట్ల జీతం తీసుకునే ఓ ఉద్యోగిని తొలగించింది. ఈ ఘటన అమెరికాలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కెంటకీలోని లూయిస్‌విల్లేలో ఉన్న ఫోర్డ్ ట్రక్ ఫ్యాక్టరీలో.. 60ఏళ్ల కర్ట్ క్రోమ్ 11 ఏళ్లుగా పని చేస్తున్నాడు. ఎంతో విధేయతగా సగటున వారానికి 60 గంటలు పనిచేసేవాడినని.. అయినప్పటికీ తప్పుడు ఆరోపణలతో తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను కంపెనీలో రూ. 1.9 కోట్లు సంపాదిస్తున్నానని.. గతేడాది ఆఫీస్ క్యాంటీన్‌లో సుమారు రూ. 1.14లక్షలు ఖర్చు చేశానని తెలిపాడు. ఇటీవల కంపెనీలో ఉన్న సమయంలో షుగర్ లెవల్స్ పడిపోతున్నట్లు అనిపించడంతో ఓ చాక్లెట్ కుకీ కుకీని కొనుగోలు చేశానని పేర్కొన్నాడు. కొద్ది రోజుల అనంతరం సూపర్‌వైజర్ తనను పిలిచి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు చెప్పాడని.. కారణమేంటని అడగ్గా కుకీని దొంగలించినందుకు జాబ్ నుంచి తీసేస్తున్నట్లు పేర్కొన్నాడని వెల్లడించాడు. తాను కుకీని దొంగలించలేదని.. దానిని కొనుగోలు చేసినట్లు తన వద్ద బిల్లు ఉందని చెప్పినప్పటికీబలవంతంగా ఫ్యాక్టరీ ప్రాంగణం నుంచి బయటకు పంపేశారని ఆరోపించాడు. ఆ బిల్లు స్క్రీన్‌షాట్ పంపించిన అనంతరం తాను నిర్దోషిగా తేలడంతో ఉద్యోగానికి తిరిగి రావాలని యూనియన్ ప్రతినిధి పిలిచారని బాధితుడు వెల్లడించాడు. కానీ తనను అవమానించిన చోట పని చేయకూడదని నిర్ణయించుకున్నట్లు అతడు వెల్లడించాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఉద్యోగి పట్ల ఫోర్డ్ అధికారుల తీరును నెటిజన్లు విమర్శిస్తున్నారు.



# ఐరాస ప్రధాన కార్యాలయం ఎదుట టిబెట్ పతాకంతో వ్యక్తి ఆత్మహత్య

**న్యూయార్క్:** టిబెట్ ఆక్రమణను చైనా వీడాలంటూ ఓ వ్యక్తి న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమతి ప్రధాన కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకున్నాడు. సంప్రదాయ బౌద్ధ సన్యాసి వస్త్రాలను ధరించి.. టిబెట్‌ను చైనా వీడాలని రాసి ఉన్న కరపత్రాలను, టిబెట్ పతాకాన్ని పట్టుకుని తనకు తాను నిప్పంటించుకున్నాడు. మృతుడిని లోబ్గా రాంగ్జెన్ (52)గా గుర్తించినట్లు తెలుస్తోంది. అతడిని తక్షణమే ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఐరాసలో సమావేశాల షెడ్యూళ్లు ముగిసిన తర్వాత ఈ ఘటన చోటు చేసుకొంది. టిబెట్ నుంచి చైనా వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ 2009 నుంచి దాదాపు 150 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో బౌద్ధ సన్యాసులు, విద్యార్థులు, రైతులు అధికంగా ఉన్నారు. 2009లో యువ బౌద్ధ సన్యాసి ఆత్మహత్యతో ఇది మొదలైంది. దలైలామా తిరిగి టిబెట్‌కు రావాలని.. చైనా ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లాలని వారి ప్రధాన డిమాండ్లు. మరోవైపు ప్రవాస టిబెట్ నాయకులు వారిని రెచ్చగొట్టి ఆత్మహత్యలు చేసుకునేలా ప్రేరేపిస్తున్నారన్నది చైనా వాదన. 1951లో చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ టిబెట్‌ను ఆక్రమించుకుంది. 13వ శతాబ్ధం నుంచి టిబెట్ తమ దేశంలో భాగమని డ్రాగన్ వాదిస్తోంది.



## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**అన్నంరాజు శ్రీనివాస్, చిన్నంరాజు సాయినాథ్ గౌడ్.**

**నాగారం, జూలై 3 (జనం వార్త) :** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నంరాజు శ్రీనివాస్, చిన్నంరాజు సాయినాథ్ గౌడ్ అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని మాజీ కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య శ్రీనివాస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో ఛాతి నొప్పి సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి చాతి ఎక్స్ రేలను తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు మంచి ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతో ఈవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు.



## శేరిలింగంపల్లిలో ఎస్ఐఆర్ సర్వే ముమ్మరం

**శేరిలింగంపల్లి, జూలై 3(జనం వార్త):** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి డివిజన్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) సర్వే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్ మార్గదర్శకత్వంలో ఆర్‌జీకే కాలనీ, పాపిరెడ్డి కాలనీ, గోపీనగర్ ప్రాంతాల్లో బీఎల్ఏ ఏజెంట్లు, పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను పరిశీలిస్తూ సర్వే నిర్వహిస్తున్నారు. అలాగే అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పిస్తూ అవసరమైన సూచనలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన ఓటరు హక్కును పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఓటు విలువైనదని, అర్హులైన వారందరికీ న్యాయం జరిగేలా ఎస్ఐఆర్ సర్వేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## వర్షపు నీటి పైప్‌లైన్ పనులకు శ్రీకారం

**మోండా డివిజన్‌లో భూమిపూజ చేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

**సికింద్రాబాద్ :** కంటోన్మెంట్ నియోజకవర్గంలో వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ రూ. 31 లక్షల 10 వేల అంచనా వ్యయంతో వర్షపు నీటి పైప్‌లైన్ (రెయిన్ వాటర్ సీవరేజ్) నిర్మాణ పనులకు శుక్రవారం భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. మోండా డివిజన్‌లోని అల్లాడి పెంటయ్య నగర్‌లో రూ. 9.50 లక్షలతో 200 మీటర్లు, డొక్కాలమ్మ టెంపుల్ ప్రాంతంలో రూ. 9.10 లక్షలతో 200 మీటర్లు, కుమ్మరిగూడలో రూ. 12.50 లక్షలతో 250 మీటర్ల మేర మొత్తం 650 మీటర్ల పొడవున పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, వర్షాలు కురిసినప్పుడు ఈ ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యను గుర్తించి వెంటనే నిధులు మంజూరు చేయించామని, పనులను ఎలాంటి రాజీ లేకుండా అత్యుత్తమ నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే తన లక్ష్యమని, దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తూ నవ కంటోన్మెంట్ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వసంత నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా శ్రీనివాస్‌బాబు



**కూకట్‌పల్లి, జూలై 03 (జనం వార్త) :** నూతనంగా ఏర్పడిన వసంత నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కిలారు శ్రీనివాస బాబు శుక్రవారంనియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్, డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ అధికారిక పూర్వకంగా ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా నియమితులైన కిలారు శ్రీనివాస బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో నిజాయితీగా కష్టపడి పని చేసే నాయకులకు, కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని మరోసారి రుజువైందన్నారు. తనపై ఎంతో నమ్మకంతో నూతనంగా ఏర్పడిన వసంత నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్ కు, డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ కు, పిసిసి ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ బండి రమేష్ లతో పాటు తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చెయకుండా డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి పార్టీ పటిష్టకు కృషి చెస్తానన్నారు.



# పీర్జాదిగూడ కాంగ్రెస్‌లో ముసలం..!



## మూకుమ్మడి రాజీనామాలకు రంగం సిద్ధం..?

**డివిజన్ అధ్యక్షుల నియామకాలపై మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నేతల తీవ్ర అసంతృప్తి**

**మేడిపల్లి, జూలై 03 (జనం వార్త) :** మేడ్చల్ నియోజకవర్గంలోని పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్‌లలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రరూపం దాల్చినట్లు సమాచారం. ఇటీవల చేపట్టిన పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్ అధ్యక్షుల నియామకాలపై అసంతృప్తితో ఉన్న మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమవుతున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీలో నమ్మకంతో ఎన్నేళ్లుగా పనిచేస్తున్న తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, కీలక నిర్ణయాల్లో తమ అభిప్రాయాలను పట్టించుకోవడం లేదని సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అసంతృప్తి వర్గంలో మాజీ మేయర్, మాజీ డిప్యూటీ మేయర్‌తో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు కూడా ఉండడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. శుక్రవారం స్థానికంగా సమావేశమైన అసంతృప్త నాయకులు ప్రస్తుత రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. పార్టీ అధిష్టానం వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించకపోతే తమ తదుపరి కార్యాచరణను బహిరంగంగా ప్రకటించడంతో పాటు మూకుమ్మడి రాజీనామాలు చేసే అవకాశాలను కూడా పరిశీలించినట్లు విశ్వసనీయ సమాచారం. అసంతృప్త నేతలను పార్టీ అధిష్టానం బుజ్జగిస్తుందా? లేక ఈ అసమ్మతి మరింత ముదిరి రాజకీయంగా కొత్త పరిణామాలకు దారితీస్తుందా? అనే అంశం ఇప్పుడు స్థానిక రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## మేడ్చల్ జిల్లాలో 46.92 శాతం ఎన్యూమరేటర్ పత్రాల పంపిణీ

- జిల్లాలో మొత్తం ఓటర్లు 29,79,130 మంది
- ఎనిమిది రోజుల్లో కలిపి 13,97,778 పత్రాల పంపిణీ

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ( సర్ ) చురుగ్గా కొనసాగుతోంది. ఇప్పటి జిల్లా వ్యాప్తంగా (జులై 3 వరకు) 13,97,778 ఎన్యూమరేషన్ ఫామ్స్ ను పంపిణీ చేశారు. సర్ ప్రక్రియ జూన్ 25న ప్రారంభమైన విషయం తెలిసిందే. జిల్లాలో 29,79,130 మంది ఓటర్లు ఉండగా అందులో ఎనిమిది రోజుల్లో 13,97,778 ఎన్యూమరేటర్ ఫామ్స్ ను పంపిణీ చేశారు. మేడ్చల్ జిల్లాలోని 5 నియోజక వర్గాలలో కలిపి మొత్తం 29,79,130 మంది ఓటర్లు ఉన్నారు.

**ఎన్యూమరేటర్ ఫామ్స్ వివరాలు ఇలా:**

మేడ్చల్ నియోజక వర్గంలో 6,77,381 మంది ఓటర్ల కు గాను – 3,12,403 ఫామ్స్, మల్కాజిగిరి నియోజక వర్గంలో 5,13,144, ఓటర్లకు గాను – 2,30,557 ఫారాలు, కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో 7,47,427 ఓటర్లకు గాను – 3,62,789 ఫారాలు, కూకట్ పల్లి నియోజక వర్గంలో 4,93,408 ఓటర్లకు గాను – 2,37,015 ఫారాలు, ఉప్పల్ నియోజక వర్గంలో 5,47,770 ఓటర్ల కు గాను 2,55,014 పత్రాలను, మొత్తం కలిపి 13,97,778 పత్రాలను పంపిణీ చేశారు.

**పర్సెంటెజీల వారిగా :**



అనగా, మేడ్చల్ నియోజక వర్గంలో 46.12 శాతం, మల్కాజిగిరి నియోజక వర్గంలో 44.93 శాతం, కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో 48.54 శాతం, కూకట్పల్లి నియోజక వర్గంలో 48.04 శాతం, అలాగే, ఉప్పల్ నియోజక వర్గంలో 46.55 శాతం మొత్తం కలిపి 46.92 శాతం పత్రాలను పంపిణీ చేశారు. కాగా జిల్లాలో ఇప్పటి వరకు జులై 2 వరకు 14,148 ఫామ్స్ ను మాత్రమే డిజిటలైజ్ చేశారు. ఇందులో, మేడ్చల్ నియోజకవర్గంలో 2,976 పత్రాలు, మల్కాజిగిరి నియోజక వర్గంలో 2,230 పత్రాలను, కుత్బుల్లాపూర్ లో 4,302 పత్రాలను, కూకట్పల్లి నియోజకవర్గంలో 3,654 పత్రాలను, ఉప్పల్ నియోజక వర్గంలో 1,886 పత్రాలను డిజిటలైజ్ చేశారు.



## రెజ్లింగ్ క్రీడాకారులకు తలసాని శ్రీనివాస్ యాదవ్ అండ

**హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన 30 మంది రెజ్లర్లకు ట్రాక్‌సూట్లు, షూస్, ఆర్థిక సహాయం**

**సికింద్రాబాద్ :** హర్యానా రాష్ట్రంలోని రోహ్‌తక్‌లో ఈ నెల 10 నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు తెలంగాణ నుంచి ఎంపికైన క్రీడాకారులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం ఆర్థిక, క్రీడా సామగ్రి సహాయాన్ని అందజేశారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ విభాగాల్లో ఎంపికైన 10 మంది బాలికలు, 20 మంది బాలురకు ట్రాక్‌సూట్లు, షూస్‌తో పాటు పోటీలకు వెళ్లి వచ్చేందుకు అవసరమైన రవాణా ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వ్యాయామ శాలల నిర్వాహకులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హైదరాబాద్ రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, అధ్యక్షుడు సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అస్లాం, నసీర్ కూలకి, కాలియా, సలాం ఆమూది, ఖాలిద్ బామూస్, కోచ్‌లు వైష్ణవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆదాయ వృద్ధే లక్ష్యంగా కృషి చేయాలి

**చెంగిచెర్ల డిపో ఉద్యోగులకు డీఆర్ఎం మహేష్ కుమార్ పిలుపు**

**అధిక ఆదాయం సాధించిన కండక్టర్లు, ఇంధనం ఆదా చేసిన డ్రైవర్లకు ఘన సన్మానం**

**బోడుప్పల్ :** ఆర్టీసీ సంస్థను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేసి అధిక ఆదాయం సమకూర్చాలని సికింద్రాబాద్ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. చెంగిచెర్ల ఆర్టీసీ డిపోను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి డిపో కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించి, కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో సమావేశమైన మహేష్ కుమార్ ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ అభివృద్ధితో పాటు కుటుంబ సంక్షేమాన్ని కూడా కాపాడుకోగలరని సూచించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు తన వంతు సందేశాన్ని అందించారు. డిపోలో నిర్వహించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో అధిక






ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు, ఇంధనాన్ని ఆదా చేసిన డ్రైవర్లను శాలువాలతో ఘనంగా సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. ఉద్యోగుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సంస్థ పురోగతికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. సమిష్టి కృషి, టీమ్‌వర్క్‌తో చెంగిచెర్ల డిపోను రాష్ట్రంలోని అన్ని డిపోల కంటే అత్యధిక ఆదాయం సాధించే ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్ స్వాతి, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఆనందరావు, అసిస్టెంట్ మేనేజర్ (మెకానిక్) సత్తయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్ లక్ష్మీ కళ్యాణి డిప్యూటీ సూపరింటెండెంట్ లక్ష్మి, డిపో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## ఓల్డ్ బోయిన్‌పల్లి ఘోరీ నగర్‌లో డ్రింకింగ్ వాటర్ పైప్‌లైన్ లీకేజీ

**వృథాగా పోతున్న మంచినీరు**

**రోడ్డుపై నిలిచిన నీటితో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**

**సికింద్రాబాద్ :** ఓల్డ్ బోయిన్‌పల్లి పరిధిలోని ఘోరీ నగర్ ప్రాంతంలో డ్రింకింగ్ వాటర్ మెయిన్ పైప్‌లైన్ లీకేజీ కారణంగా విలువైన తాగునీరు భారీగా వృథా అవుతోంది. ఇటీవల చేపట్టిన అండర్‌గ్రౌండ్ పనుల సమయంలో పైప్‌లైన్ దెబ్బతినడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు. లీకేజీ కారణంగా రోడ్డంతా నీటితో నిండిపోవడంతో వాహనదారులు, పాదచారులు, స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు నిరంతరం వృథాగా ప్రవహిస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు సమాచారం అందించినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని కాలనీ వాసులు ఆరోపించారు. వెంటనే స్పందించి పైప్‌లైన్ లీకేజీని మరమ్మత్తు చేసి తాగునీటి వృథాను అరికట్టాలని వారు కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.



# పాకిస్థాన్‌లో లోయలో పడ్డ బస్సు

## 40మంది ప్రయాణికుల దుర్మరణం

**ఇస్లామాబాద్, జూలై 3 :** పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు.. లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 40 మంది ప్రయాణికులు మరణించారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రంలో షేరానీ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న షేరానీ జిల్లా ఉన్నతాధికారులు, వైద్యులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స కోసం ఝోబ్‌లోని ట్రామా సెంటర్‌కు తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన అత్యంత ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఇదీ కూడా ఒకటని అధికారులు తెలిపారు. సాంకేతిక లోపంతో ఓ బస్సు ఆగిపోయిందని, దీంతో అందులోని ప్రయాణికులను కూడా ఈ బస్సులోకి ఎక్కించారని అధికారులు చెప్పారు. దీంతో బస్సు ప్రయాణికులతో నిండిపోయిందన్నారు. ఈ ప్రమాదం జరిగిన బస్సు.. 36 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి బయలుదేరిందని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమైందని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు

## స్టేషన్‌లో రక్తపు మరకలు, లాఠీ గుర్తింపు

**విజయవాడ, జూలై 3 :** రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోన్న గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజు కస్టడీ కోరుతూ దాఖలు చేసిన మెమోలో కోర్టుకు సిట్ ముఖ్య విషయాలు తెలియజేసింది. కేసులో కీలకమైన సీసీటీవీ ఫుటేజ్ స్టేషన్‌లో లేదని.. అవి ధ్వంసమయ్యే అవకాశం ఉన్నట్టు ఫోరెన్సిక్ ల్యాబ్ గుర్తించిందని సిట్ వెల్లడించింది. స్టేషన్‌లో అనుమానాస్పద మరకలు గుర్తించినట్లు తెలిపింది. అనుమానాస్పద మరకలు ఉన్న లాఠీ, ఎముకలు, కాలిపోయిన బూడిద, పాక్షికంగా కాలిన ఇనుప హ్యాండ్ గొలుసును స్టేషన్ టెర్రస్ నుంచి సీజ్ చేసినట్లు పేర్కొంది. సాయికృష్ణ కస్టడీలో తీవ్ర గాయాలతో మృతి చెందాడని కొందరి స్టేట్‌మెంట్ల ఆధారంగా గుర్తించామని సిట్ తెలిపింది. మృతదేహాన్ని ఏం చేశారనే విషయాన్ని కస్టడీకి అనుమతిస్తే సీఐ నాగరాజును తీసుకువెళ్లి గుర్తిస్తామని మెమోలో సిట్ పేర్కొంది.

# శ్రీవారిని దర్శించుకున్న సినీ ప్రముఖులు

## చలనచిత్ర అభివృద్ధి సంస్థలో సభ్యుడిగా నియమించారన్న సుమన్

**తిరుపతి, జూలై 3 :** ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ బోర్డు డైరెక్టర్లలో ఒకరిగా తననూ నియమించారని నటుడు సుమన్ తెలిపారు. ఈ పదవికి తనను నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సిఫార్సు చేసినట్లు వెల్లడించారు. ఈ పదవిని ఒక బాధ్యతగా భావించి ఏపీలో సినిమా షూటింగ్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని సుమన్ స్పష్టం చేశారు. శుక్రవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. నిర్మాతలు దిల్‌రాజు, బండ్ల గణేశ్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు వేర్వేరుగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శన అనంతరం పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు

## వెలుగులోకి జైష్-ఎ-మహ్మద్ కుట్ర.. మధ్యప్రదేశ్‌లో 8 మంది అరెస్ట్

**గాంధీనగర్, జూలై 3 :** గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు కోసం ఉగ్రవాద సంస్థ జైష్-ఎ-మహ్మద్ చేసిన కుట్ర వెలుగులోకి వచ్చింది. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్.. గుజరాత్, మధ్యప్రదేశ్‌లో 8 మందిని అరెస్ట్ చేసింది. గుజరాత్ ఏటీఎస్ అధికారులు గురువారం గుజరాత్‌లోని బనస్కాంత, పటాన్, నవ్‌సారితో పాటు పొరుగు రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని దేవాస్ ప్రాంతంలో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఈ 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అహ్మద్ గాజీవాలా, ఇబ్రహీం ఘూఘూ, ముదస్సిర్ గాజీవాలా, జకారియా దురానీ, ముఫ్తీ ఫౌజాన్ దౌవా, మహ్మద్ అమీన్ పాలన్‌పురి, మహ్మద్ అబ్దుల్ సాఫ్దీ, బిలాల్ దురానీ ఘూఘూగా గుర్తించారు. వీరిలో ముగ్గురు సిద్‌పూర్, చిఖ్లీలోని మతపరమైన విద్యాసంస్థలతో సంబంధం ఉన్నట్లు తేలింది. నిందితులంతా జైష్-ఎ-మహ్మద్ సంస్థ తరఫున యాక్టివ్‌గా పనిచేస్తూ.. గుజరాత్ వ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి పని చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. అంతేకాదు.. ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతుగా రిక్రూట్‌మెంట్లు చేపట్టడానికి ఎ÷-లాన్ చేసినట్లు తేల్చారు. అధికారులు అరెస్టైన వారిపై ఉగ్రవాద నిరోధక చట్టాల కింద కేసులు నమోదు చేశారు. వారినుంచి డిజిటల్ పరికరాలు, ఇతర ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. ఉగ్రవాద సంస్థతో దేశవ్యాప్త సంబంధాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# భావ ప్రకటన స్వేచ్ఛ అంటే బూతుల ప్రచారమా?

- సోషల్ మీడియాలో పవన్‌పై విమర్శలు తగవు
- మండిపడ్డ మంత్రి కందుల దుర్గేశ్

**విజయవాడ, జూలై 3 :** సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, వ్యక్తిగత దూషణలు, తప్పుడు ప్రచారాలపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రంగా స్పందించారు. భావప్రకటన స్వేచ్ఛ అంటే బూతుల లైసెన్స్ కాదని హెచ్చరించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు సోషల్ మీడియాలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా బలహీనపరిస్తే కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయవచ్చన్న వ్యూహంతో వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. కేవలం వ్యూస్ పెంచుకోవడం, బ్లాక్‌మెయిలింగ్ కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేరును ఉపయోగించడం సరికాదని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రశ్నించే హక్కుంది.. కానీ హద్దులు దాటే హక్కు లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాపై నియంత్రణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈసందర్భంగా రుషికొండ ప్యాలెస్ అంశంపైనా మంత్రి స్పందించారు. రుషికొండ ప్యాలెస్‌ను పర్యాటకాభివృద్ధి, ప్రజల సందర్శన కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ను ఆహ్వానించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా పర్యాటక శాఖకు ఏటా సుమారు రూ.7 కోట్ల నష్టం వాటిల్లిందని, ఇకపై పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.

# రాయలసీమ ప్రాంతాన్ని ఉక్కుసీమగా మారుస్తా

- 'స్టీల్ స్టేట్'గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం
- సున్నపురళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మాణం
- సీమలో పారాల్సింది రక్తం కాదు..నీళ్లు
- మావిగన్, విజయవాడ.. రేపు మరేంటో
- జగన్ తీరుపై పరోక్షంగా విమర్శలు
- సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి




**అమరావతి, జూలై 3 :** ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త పారిశ్రామిక హబ్‌గా, ముఖ్యంగా 'స్టీల్ స్టేట్'గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కడప జిల్లాలోని జమ్మలమడుగు మండలం సున్నపురళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మించనున్న ప్రతిష్టాత్మక జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఆ తర్వాత విజయనగరం జిల్లాలోని జిందాల్ పారిశ్రామిక పార్కును వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. రాయలసీమకు స్వర్ణయుగం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశంలోనే మొదటిసారిగా గ్రీన్ స్టీల్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. కేవలం విశాఖపట్నం మాత్రమే కాకుండా, రాయలసీమ ప్రాంతాన్ని కూడా 'ఉక్కుసీమ'గా మారుస్తామని హామీ ఇచ్చారు. గతంలో స్టీల్ ప్లాంట్ పేరుతో కొందరు ఐరన్ ఓర్‌ను దోచుకుంటూ స్మగ్లింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాయలసీమ ప్రాంతానికి రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకువచ్చామని అన్నారు. అంతేకాదు స్థానికంగా పరిశ్రమలు స్థాపించి ఇక్కడి యువతకే ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గతంలో అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమను తీసుకురావడం వల్ల ఆ ప్రాంత రూపురేఖలు మారాయన్నారు. ఇప్పటి వరకూ అక్కడ 19 లక్షల కార్లు తయారయ్యాయని గుర్తుచేశారు. రాయలసీమకు ఎవరి వల్ల నష్టం జరిగింది, ఎవరి హయాంలో మంచి జరిగిందో ప్రజలు చరిత్రను ఒకసారి గుర్తుచేసు కోవాలని కోరారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో రాయలసీమ చరిత్రలో నవశకం మొదలైంది. రాయలసీమ బిడ్డగా అభివృద్ధి చేసి చూపెడతా. రాయలసీమ అంటే కరవు నేల కాదు జలకళ కాబోతోందన్నారు. ఈ ప్రాంతం హార్టికల్చర్‌హబ్‌గా మారిపోయింది. విధ్వంస పాలనతో నష్టపోయిన రాష్ట్రానికి మళ్లీ ప్రాణం పోస్తున్నాం. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలతో రాయలసీమ బిజీగా మారింది. రాళ్ల సీమ కాదు.. రతనాల సీమ అని చూపిస్తున్నాం. ఇంకా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సజ్జన్ జిందాల్ సిద్ధంగా ఉన్నారు. రాబోయే రోజుల్లో సీమకు అన్నీ మంచి రోజులే. రాయలసీమలో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ముందే మాట ఇచ్చాం. గతంలో మోసపూరిత శంకుస్థాపనలు చూ శాం. 2019 డిసెంబరులో ఒకసారి, 2023లో రెండోసారి భూమి పూజ చేశారు. తట్ట మట్టి అయినా తీశారా.. చిన్న భవనమైనా కట్టారా? అడ్డంకులన్నీ తొలగించుకొని వచ్చాం, 1100 ఎకరాల భూమి ఇచ్చాం. రెండు స్టేజీల్లో రెండు మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగనుంది. జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ ఎ÷-లాంట్‌తో ఏపీ.. ఉక్కు రాష్ట్రంగా తయారవుతుంది. విశాఖ మాత్రమే కాదు.. రాయలసీమ కూడా ఉక్కుకు కేంద్రమవుతోందని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఒకప్పుడు రాయలసీమలో ఉన్న ఫ్యాక్షన్ సంస్కృతిని అంతం చేశామని, సీమలో పారాల్సింది రక్తం కాదు.. సాగునీరు. ఫ్యాక్షనిజం పోయినప్పటికీ, నేరాలు చేసేవాళ్లు రాజకీయాల్లోకి రావడం దురదృష్టకరం అన్నారు. విధ్వంసమే అజెండాగా పెట్టుకున్న ఒక వ్యక్తి రాష్ట్రానికి ఏం చేయగలరు. 2014లో అమరావతిని రాజధానిగా అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు, అయితే అధికారంలోకి వచ్చాక.. మూ డు రాజధానులంటూ నవ్వులపాలు చేశారు. మావిగన్, విజయవాడ అంటూ మతిస్థిమితం లేని వ్యక్తిలా మాట్లాడుతున్నారు. రేపు ఇంకేమంటారో తెలియని పరిస్థితి. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. రాష్ట్రంలో రౌడీ మూకలు, గంజాయి బ్యాచ్‌లకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోంది. ఇలాంటి అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం.' అని సీఎం తెలిపారు.

# రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధికి చర్యలు

- ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ తరహాలో అప్పగింత
- ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం



**అమరావతి, జూలై 3 :** రుషికొండ భవనాల విషయంలో ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. హిల్‌టాప్‌లోని భవనాల నిర్వహణ, ఆపరేషన్, మార్కెటింగ్ కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటెస్ట్ ను ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసింది. లీజ్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ మోడల్‌లో రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం కల్పించనుంది. ఎంపికైన ప్రైవేట్ సంస్థ.. ఐదు భవనాల సముదాయాన్ని నిర్వహించనుంది. మొత్తం 9.8 ఎకరాల హిల్‌టాప్ ప్రాజెక్టును మోడల్‌లో ప్రభుత్వం వినియోగించనుంది. రుషికొండ దిగువ ప్రాంతంలో ఉన్న మరో 9 ఎకరాల భూమి అభివృద్ధికి కూడా అవకాశం కల్పించనుంది. హోటళ్లు, రిసార్టులు, పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఏపీటీడీసీ తెలిపింది. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే వ్యూయింగ్ ఏరియాలు, ఓపెన్ స్పేస్‌లు తప్పనిసరిగా ఉండేలా నిబంధనలు విధించింది. ప్రస్తుత భవనాలతో పాటు అదనపు అభివృద్ధికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. రెండు ఖాళీ స్థలాల్లో మొత్తం 2,400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అభివృద్ధికి అవకాశం ఉండగా, అదనంగా సుమారు 4,800 చదరపు మీటర్ల వరకు జీప్లస్ 1 నిర్మాణాలకు అనుమతి ఇవ్వనుంది. సీఆర్‌జెడ్ నిబంధనలు, చట్టబద్ధ అనుమతుల ప్రకారమే అన్ని నిర్మాణాలు చేపట్టాలని ఏపీటీడీసీ స్పష్టం చేసింది. పెట్టుబడిదారుల ఆసక్తి, ప్రాజెక్టు వాణిజ్య సాధ్యాసాధ్యాలను ఇక్షవి ద్వారా అంచనా వేసి... అనంతరం ఆర్‌ఎఫ్‌పీ దశలో తుది ఎంపిక పక్రియ జరగనుంది. హోటల్ చైన్లు, రిసార్ట్ డెవలపర్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీటీడీసీ వెల్లడించింది. హాస్పిటాలిటీ రంగంలో అనుభవం ఉన్న సంస్థలకే అర్హత కల్పించనున్నట్లు తెలిపింది. మార్చి 31, 2025 నాటికి పాజిటివ్ నెట్‌వర్త్ తప్పనిసరి అని పేర్కొంది. ఇక్షవి దాఖలుకు చివరి తేదీ జులై 10 సాయంత్రం 5 గంటలుగా నిర్ణయించారు. తుది లీజ్ నిబంధనలు, ఆదాయ భాగస్వామ్యం తదితర అంశాలను ఖరారు చేయనున్నట్లు ఏపీటీడీసీ వెల్లడించింది.

# ఉగ్రవాదాన్ని ఎగదోయడం మానుకోండి

## సింధుజలాలపై పాక్ ప్రేలాపనలపై భారత్ మండిపాటు

**న్యూఢిల్లీ, జూలై 3 :** సింధు జలాల్లో తమ వాటా తీసుకొంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పాక్ మంత్రి ముసాదిక్ మాలిక్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. దాయాది దేశం ఉగ్రవాదాన్ని ఎగదోయడం, ఉగ్ర కార్యకలాపాలను ప్రోత్సహించడం మానుకొనే వరకు సింధు జలాల నిలిపివేత కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఉగ్రవాదం విషయంలో తమ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని తేల్చి చెప్పింది. 1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ ఒప్పందం చట్టబద్ధమైన నిబంధనలు కట్టుబడి ఉంటుందని తెలిపింది. దానిని ఏకపక్షంగా నిలిపివేయడం గానీ.. సవరించడం గానీ సాధ్యం కాదని పాక్‌కు చురకలు అంటించింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని పాక్ విడనాడాలని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ సూచించారు. సింధు జలాల నియంత్రణకు భారత్ యత్నిస్తోందని.. పాక్‌లోకి చుక్క నీరు కూడా ప్రవహించకుండా పొరుగు దేశ ప్రధాని అడ్డుకుంటున్నారని ఇటీవల పాక్ మంత్రి ముసాదిక్ ఆరోపించారు. తమ నీటి హక్కులకు ముప్పు వాటిల్లితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మరో మంత్రి అట్టావుల్లా తరార్ మాట్లాడుతూ.. నీటి అంశం తమ దేశ జాతీయ భద్రతలో కీలక భాగమని పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందం చట్టబద్ధంగా అమల్లోనే ఉందని, దాన్నెవరూ రద్దు చేయలేరంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. ఈ క్రమంలోనే విదేశాంగ శాఖ దీటుగా స్పందించింది. అఫ్ఘానిస్థాన్ పై పాకిస్థాన్ సైనిక దాడులను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. అఫ్ఘాన్ సార్వభౌమత్వానికి భారత్ మద్దతు కొనసాగిస్తుందని రణధీర్ జయస్వాల్ పునరుద్ఘాటించారు. మానవతా సాయం, అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా ఆ దేశంతో సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. ఇటీవల వెనెజువెలాలో అనుమానాస్పద స్థితిలో భారత నావికుడు రాకేశ్ చౌహాన్ మృతిచెందిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. మృతదేహంలో అవయవాలు మాయం కావడం గురించి అక్కడి అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది.

# విద్యార్థిని భుజానికేసుకుని ఆస్పత్రికి


## వార్డెన్ హేమ సాహసోపేత నిర్ణయం

## అభినందించిన రాయపాటి శైలజ

**పార్వతీపురం,జూలై3 :** పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్ హేమ.. ఓ విద్యార్థిని పట్ల మానవత్వం చూపారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న బాలికను భుజంపై ఎత్తుకుని సుమారు 6 కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లి ఆస్పత్రిలో చేర్పించారు. సకాలంలో వైద్యం అందేలా చేసి విద్యార్థిని ప్రాణాన్ని కాపాడారు. ఈ విషయమై ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ స్పందిస్తూ.. వార్డెన్ హేమను అభినందించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆమెపై ప్రశంసలు కురిపించారు. సేవాభావంతో పనిచేసే మీలాంటి అధికారులు.. ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని కొనియాడారు. 'మానవత్వం, సేవాభావం, విధి పట్ల నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం గిరిజన ఆశ్రమ పాఠశాల హేమకు హృదయపూర్వక అభినందనలు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న విద్యార్థినిని తన భుజాలపై మోస్తూ కొండలు, గుట్టల మీదుగా సుమారు 6 కిలోమీటర్లు నడిచి సకాలంలో వైద్యం అందేలా చేసి ఆ బాలిక ప్రాణాన్ని కాపాడిన మీ సేవాస్ఫూర్తి, మానవత్వం, నిబద్ధత నిజంగా అభినందనీయం. విధి అనేది కేవలం బాధ్యత కాదని, దానికి మానవత్వం తోడైతే ఒక ప్రాణాన్ని కూడా కాపాడవచ్చని మీరు నిరూపించారు. మీలాంటి సేవాభావం, అంకితభావంతో పనిచేసే అధికారులు.. ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలవాలి. సమాజంలో మరెందరో ఇలాంటి స్ఫూర్తితో ముందుకు రావాలని ఆకాంక్షిస్తూ.. హేమకు మరోసారి హృదయపూర్వక అభినందనలు' అని ఎక్స్‌లో రాయపాటి శైలజ రాసుకొచ్చారు.

# అయోధ్య చోరీపై ఆర్‌ఎస్‌ఎస్ ఆందోళన

- దోషులను కఠినంగా శిక్షించాల్సిందే
- హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని వదలరాదు
- ఈ ఘటనతో హిందూ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదు
- విచారం వ్యక్తం చేసిన ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి దత్తాత్రేయ హోసబలే




**న్యూఢిల్లీ, జూలై 3 :** అయోధ్య రామ మందిర విరాళాల చోరీ ఘటనపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ ఎసెస్ ఆందోళన వ్యక్తం చేసింది. రాముడి విరాళాలను దొంగిలించడం తమను తీవ్రంగా బాధిస్తోందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే విచారం వ్యక్తం చేశారు. తరతరాలుగా భక్తుల త్యాగాలు, అంకితభావం కారణంగా శ్రీరామ జన్మభూమిలోని ఈ భారీ ఆలయం రూపుదిద్దుకుందన్నారు. ఆలయ నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఒక ప్రత్యేకమైన అంశంగా పరిగణించి, ఆలయ నిర్వహణలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాలని హోసబలే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను కోరారు. ఈ కేసులో దర్యాప్తు జరుగుతున్నందున నిందితులకు శిక్షపడే వరకు సంయమనం పాటించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనను అవకాశంగా తీసుకొని కొందరు వ్యక్తులు హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రామమందిర విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో రాజీనామా చేసిన అయోధ్య ఆలయ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రాలకు శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ షో-కాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆలయ అధికారుల మధ్య జులై 6న జరగనున్న కీలక సమావేశంలో ఈ చర్యలు తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విరాళాల అవకతవకలకు సంబంధించి లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని వారిని కోరనున్నట్లు తెలిపాయి. దర్యాప్తు అనంతరం వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రామ్ మందిర్ విరాళాల వివాదంపై ఆర్‌ఎస్‌ఎస్ శుక్రవారం స్పందించింది. అయోధ్య హుండీల నుంచి డబ్బులు దొంగతనం చేయటంపై ఆర్‌ఎస్‌ఎస్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సంఘటన ఎంతో బాధ కలిగించిందని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జనరల్ సెక్రటరీ దత్తాత్రేయ హొళసబలే న్యూఢిల్లీ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో.. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. ఆలయ నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కోరారు. దేశ వ్యతిరేక శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఘటన కోట్లాది మంది రామభక్తుల నమ్మకాన్ని, హిందూ సమాజం సెంటిమెంట్లను తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన కారణంగా మేము తీవ్ర ఆవేదనకు, ఆగ్రహానికి గురయ్యాం. ఈ దురదృష్టకర సంఘటనను హిందూ వ్యతిరేక, దేశ వ్యతిరేక శక్తులు తమ స్వార్థం కోసం వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. హిందూ సమాజంపై, సనాతన ధర్మంపై బురద జల్లడానికి ఈ వివాదాన్ని ఒక అస్త్రంగా మలచుకునే కుట్రలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఈ కష్టసమయంలో హిందూ సమాజమంతా ఎంతో ఓపికను, నిగ్రహాన్ని ప్రదర్శించాలి. ఎలాంటి తప్పుడు ప్రచారాలకు లోనుకాకుండా.. శత్రువుల కుట్రలను తిప్పికొట్టడానికి అందరూ ఐక్యమత్యంగా ఉండాలి. రామమందిరం ఎన్నో తరాల పోరాటాలు, కోట్లాది మంది త్యాగాల ఫలితంగా నిర్మితమైంది. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా ఆలయ ట్రస్ట్ పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం నాకు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమెరికా, ఐరోపా టికెట్ల ధరలు తగ్గాయ్ : ఎయిరిండియా

విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర బాగా పెరిగినప్పుడు అంతర్జాతీయ విమాన టికెట్లపై విధించిన ఇంధన సర్‌ఛార్జీని టాటా గ్రూప్ సంస్థ ఎయిరిండియా తాజాగా కొంతమేర తగ్గించింది. ముడి చమురు ధర పశ్చిమాసియా యుద్ధం ముందు స్థాయికి తగ్గడం ఇందుకు కారణం. ఫలితంగా అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) దేశాలకు వెళ్లి, వచ్చే విమానాల్లో టికెట్ల ధరలు కొంతమేర తగ్గుతున్నాయి. అమెరికా–ఆస్ట్రేలియా విమానాల్లో టికెట్‌పై సర్‌ఛార్జీని 280 డాలర్ల నుంచి 200 డాలర్లకు, ఐరోపా–యూకే టికెట్‌పై 205 డాలర్ల నుంచి 125 డాలర్లకు ఎయిరిండియా జులై 1 నుంచే తగ్గించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.






## బంగారానికి మళ్లీ రెక్కలు..

**న్యూఢిల్లీ :** బంగారం ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. తగ్గినట్లే తగ్గిన పసిడి ధర అమాంతం పెరిగిపోయింది. అంతర్జాతీయ ధరలను అనుసరించి మళ్లీ రూ. 1.50 లక్షల స్థాయికి చేరుకుంది. 10 గ్రాముల మేలిమి పసిడి ధర ఒక్కరోజులోనే రూ. 3300 మేర పెరిగింది. అటు వెండి సైతం కిలో రూ. 5వేలు పెరిగి రూ. 2.45 లక్షలకు చేరుకుంది. దేశ రాజధాని దిల్లీ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర గురువారం రూ. 1,47,500గా ఉండగా.. నేడు రూ. 1,50,800కి చేరింది. వెండి రూ. 2.40 లక్షల నుంచి రూ. 2.45 లక్షలకు పెరిగింది. అంతర్జాతీయంగా పసిడి ధర ఔన్సు ఒక్కరోజులో 57 డాలర్లు పెరిగి 4,181 డాలర్లకు చేరుకోగా.. వెండి ఔన్సు 2.44 శాతం పెరిగి 62.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం, వెండి ధరలు ఇటీవల దిద్దుబాటుకు గురయ్యాయి. గరిష్ఠాల నుంచి దాదాపు 10 శాతం మేర పతనమయ్యాయి. దీంతో వీటి ధరలు మరింత పడతాయన్న అంచనాలతో చాలా మంది తమ వద్ద ఉన్న బంగారాన్ని సైతం విక్రయించారు. అయితే, అంతర్జాతీయంగా చోటుచేసుకున్న పరిణామాలు పసిడికి మళ్లీ డిమాండ్ కల్పించాయి. అమెరికాలో వడ్డీ రేట్లు పెంపుపై ఉన్న భయాలు పోవడం, డాలరు విలువ తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికాలో తాజాగా వెలువడిన నాన్ ఫామ్ పేరేల్ డేటా అంచనాల కంటే తక్కువగా నమోదు కాగా... ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతోందంటూ ఫెడ్ ఛైర్మన్ కెవిన్ వార్ష్ ఇచ్చిన సంకేతాలు వడ్డీ రేట్ల పెంపు భయాలను పోగొట్టాయి. దీంతో బంగారం ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. అయితే, జులై 8న రాబోయే ఫెడ్ మినిట్స్ బంగారం ధరలను దిశా నిర్దేశం చేసే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## నేనెప్పుడూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోను

### క్రిస్టియానో రొనాల్డో

క్రిస్టియానో రొనాల్డో అంతర్జాతీయ ఫుట్‌బాల్ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతాడని అతడి సోదరి చేసిన పోస్టు ఇప్పుడు వైరల్‌గా మారింది. వరల్డ్ కప్ ముగిసేలోపే నిర్ణయం ప్రకటిస్తాడని అందులో ఆమె పేర్కొంది. రౌండ్ 32లో క్రొయేషియాతో మ్యాచ్‌కు ముందు ఆమె ఈ పోస్టు చేయడంతో ఏమవుతుందోనని అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. అయితే.. క్రొయేషియాపై పోర్చుగల్ విజయం సాధించి ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది. మ్యాచ్ అనంతరం రొనాల్డో మాట్లాడుతూ.. తన రిటైర్‌మెంట్‌పై వస్తోన్న ప్రచారాన్ని ఖండించాడు. వరల్డ్ కప్ తర్వాతే ఏదైనా నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశాడు. "నేనెప్పుడూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోను. ఏదైనా సరే టోర్నీ ముగిసిన తర్వాతే డిసైడ్ చేస్తా. క్రొయేషియా ఆటగాడు లూకాతో కలిసి నేను చాలా ఏళ్లుగా ఆడా. మా వయసు కూడా దాదాపు ఒకటే. అతడు దిగ్గజ ఆటగాడు. ఇప్పటికీ ఉత్సాహంగా ఉన్నాడు. ఇప్పటికే ఈ విషయం అతడికి చాలా సార్లు చెప్పా. అతడిని ఇలా చూడటం చాలా సంతోషంగా అనిపించింది" అని క్రిస్టియానో తెలిపాడు. క్రొయేషియాపై గోల్ కొట్టిన రొనాల్డో (15).. ప్రపంచ కప్‌ల్లో అత్యధిక గోల్స్ చేసిన నాలుగో ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. లియోనెల్ మెస్సి (19), ఎంబాపె (18) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. ప్రిక్వార్టర్స్‌లో స్పెయిన్‌తో పోర్చుగల్ తలపడనుంది.

# గౌరవ్ రెడ్డి శతకం

## నల్గొండ ఘన విజయం



**హైదరాబాద్:** టీజీ 20 లీగ్‌లో అనురాగ్ నల్గొండ జట్టు మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. మెదక్ ఫాల్కన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గౌరవ్ రెడ్డి (101; 47 బంతుల్లో 6x4, 9x6) శతకంతో చెలరేగిన వేళ మెదక్ నిర్దేశించిన లక్ష్యం చిన్నబోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన మెదక్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనకు దిగిన నల్గొండ మరో 21 బంతులు మిగిలుండగానే.. కేవలం 2 వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేధించింది. మొత్తం 6 మ్యాచుల్లో నాలుగు విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉంది. లక్ష్య ఛేదనకు దిగిన నల్గొండ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్ గౌరవ్ రెడ్డి.. మెదక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరో ఓపెనర్ మోతే (34) అతడికి చక్కని సహకారం అందించాడు. ఈ జోడీని అర్జున్ గొర్రపల్లి విడగొట్టాడు. జట్టు స్కోరు 83 పరుగుల వద్ద భారీ షాట్‌కు ప్రయత్నించిన మోతే.. జగన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తొలి డౌన్‌లో వచ్చిన నితీశ్‌రెడ్డి (21) కూడా రాణించాడు. అయితే, 13వ ఓవర్లో మధుకర్ మన్నె బౌలింగ్‌లో అగర్వాల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికి జట్టు స్కోరు 141. చివర్లో వచ్చిన రాహుల్ బుద్ధి (20ని)తో కలిసి గౌరవ్‌రెడ్డి లక్ష్యాన్ని పూర్తి చేశాడు.



## మూడో రోజూ లాభాల్లోనే..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాంతాన్ని లాభాలతో ముగించాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. ఐటీ, రియాల్టీ, ఫార్మా, హెల్త్‌కేర్ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 78,152.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,502.12) లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో 600 పాయింట్ల మేర లాభాల్లో కదలాడిన సెన్సెక్స్.. మధ్యాహ్నం తర్వాత కాస్త క్షీణించింది. చివరికి 261.79 పాయింట్ల లాభంతో 77,763.91 వద్ద ముగిసింది. నిఫ్టీ 95.15 పాయింట్ల లాభంతో 24,270.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్అండ్‌టీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4179 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## వైభవ్‌ను ఎప్పుడు బరిలోకి దింపుతారు?

### కోచ్ వ్యాఖ్యలతో విభేదించిన ఏబీడీ

వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంపై క్రికెట్ ప్రపంచం ఇప్పుడు రెండుగా చీలిపోయింది. కొందరేమో అతడిని వెంటనే తుది జట్టులోకి తీసుకోవాలని కోరుతుంటే.. మరికొందరేమో డ్రెస్సింగ్ రూమ్‌ను అలవాటు చేయాలని సూచిస్తున్నారు. సంజు శాంసన్ వరుసగా మూడు మ్యాచుల్లో విఫలం కావడంతో.. వైభవ్‌ను ఎంపిక చేసేందుకు ఇదే మంచి తరుణమని మరికొందరి వాదన. అంతర్జాతీయ క్రికెట్‌కు వైభవ్ సిద్ధమే కానీ.. అరంగేట్రం చేయడానికి అందరికీ ఒకటే ప్రాసెస్ ఉంటుందని భారత అసిస్టెట్ కోచ్ డస్కటే వెల్లడించాడు. ప్రిన్స్ యాదవ్, సూర్యాంశ్ డెబ్యూ చేసిన సంగతి తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ విభేదించాడు. వైభవ్‌కు మద్దతుగా నిలిచాడు. "వైభవ్‌ను ఎప్పుడు బరిలోకి దింపుతారు? ఐర్లాండ్‌తో సిరీస్ అతడికి మంచి అవకాశం. కానీ, ఆడించలేదు. అది అత్యంత దురదృష్టకరం. సూర్యవంశీ కూడా ఇతర ఆటగాళ్ల మాదిరిగానే అరంగేట్ర ప్రక్రియను అనుసరించాల్సిందేనని చెప్పిన భారత కోచ్‌తో నేను విభేదిస్తున్నాను. ఐపీఎల్‌లో అతడి ఆటను చూశాక.. ఇంకా ఆగడం ఎందుకు? ఐర్లాండ్‌పై ఆడిస్తే బాగుండేది. కాస్త అనుభవం వచ్చేది కదా. ఆ సిరీస్‌ను భారత్ ఓడిపోయింది. ఇంగ్లాండ్‌తో తొలి టీ20 రద్దు అయింది. ఇలాంటప్పుడే టీమ్‌ఇండియా బలంగా పుంజుకోవాలి. యూకేలో దూకుడుగా ఆడేందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను అమలు చేయాలి. అక్కడ కూడా 250 లేదా 260 పరగులు చేయలేరు. ఆ పిచ్‌లపై 160 రన్స్ కూడా మంచి స్కోరే అవుతుంది. అందుకు తగినట్టుగా వ్యూహాలను అమలు చేయాలి" అని డివిలియర్స్ సూచించాడు.

# రెండో టి20 కోసం భారత జట్టులో మార్పులు!!

### ప్రిన్స్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునే చాన్స్ వైభవ్ సూర్యవంశీ కూడా తుది జట్టులోకి..!?





భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య రెండో టి20 శనివారం జరగనుంది. మాంచెస్టర్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. తొలి టి20 వర్షం కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. దాంతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో తొలి పోరు వృథా అయ్యింది. ఐర్లాండ్ చేతిలో టి20 సిరీస్ ఓటమి తర్వాత భారత్ ప్రదర్శనపై చాలా మందిలో అనుమానాలు రేకెత్తాయి. ముఖ్యంగా భారత బ్యాటింగ్ విషయంలో చాలా ప్రశ్నలే మొదలయ్యాయి. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భారత జట్టు బ్యాటింగ్ ప్రదర్శన ఘోరంగా ఉంది. ఎన్నడూ లేని విధంగా ఐర్లాండ్ చేతిలో వైట్ వాష్ అయ్యింది. ఇక ఐర్లాండ్ కంటే బలమైన ఇంగ్లండ్‌తో టి20 సిరీస్ కావడం.. టీమిండియా ఫామ్ బాగాలేకపోవడంతో ఈ సిరీస్‌లో భారత ప్రదర్శన ఎలా ఉంటుందనే దానిపై అభిమనుల్లో ఉత్కంఠ నెలకొని ఉంది. ఇక రద్దు అయిన తొలి టి20లో భారత బ్యాటింగ్ ఫర్వాలేదనిపించింది. అభిషేక్ శర్మ, శ్రేయస్ అయ్యర్‌లు అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. శివమ్ దూబె మెరుపులు మెరిపించాడు. అయితే సంజూ సామ్సన్ మరోసారి విఫలం అయ్యాడు. కేవలం పరుగుల మాత్రమే చేశాడు. అది కూడా 7 బంతులు ఎదుర్కొని. ఈ క్రమంలో రెండో టి20 కోసం భారత జట్టులో మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు మార్పులు జరిగే ఛాన్స్ ఉంది. రవి బిష్ణోయ్ స్థానంలో ప్రిన్స్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఐర్లాండ్‌తో జరిగిన రెండో టి20లో ప్రిన్స్ యాదవ్ 3 వికెట్లు తీశాడు. అయితే అనూహ్యంగా అతడిని ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టి20 నుంచి పక్కన పెట్టారు. అయితే రెండో టి20లో అతడు బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. ఇక చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీని తుది జట్టులో తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి. వరుసగా విఫలం అవుతున్న సంజూ సామ్సన్‌ను పక్కన పెట్టే అవకాశాలు ఉన్నాయి. గత మూడు మ్యాచ్‌ల్లో కలిపి 10 పరుగులు కూడా చేయలేకపోయాడు. దాంతో సంజూను పక్కన పెట్టాలని.. వైభవ్‌కు అవకాశం ఇవ్వాలనే ఒత్తిడి టీమిండియా మేనేజ్‌మెంట్ మీద ఎక్కువ అవుతుంది. ఈ ఏడాది జరిగిన టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు ఛాంపియన్‌గా నిలవడానికి ముఖ్య కారణం అయిన సంజూ సామ్సన్‌ను రెండు మ్యాచ్‌ల్లో విఫలం అయినంత మాత్రాన పక్కన పెట్టడం మంచి ఆలోచన కాదేమో అన్న దోరణిలో కోచ్ గంభీర్ ఉన్నట్లు సమాచారం. అయితే ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టి20లో కూడా విఫలం అయ్యాడు. ఒకవేళ సంజూను రెండో టి20లో కొనసాగిస్తే మాత్రం అతడికి అది చావోరేవో లాంటి మ్యాచ్. విఫలం అయితే మాత్రం మూడో టి20 నుంచి వైభవ్ ఓపెనర్‌గా ఆడే అవకాశం ఉంది. అయితే రెండో టి20లోనే వైభవ్‌కు ఛాన్స్ వస్తుందని అభిమానులు ఆశతో ఉన్నారు. ఇషాన్ కిషన్ గత రెండు మ్యాచ్‌ల్లోనూ రనౌట్ అయ్యాడు. శ్రేయస్ అయ్యర్ ఫామ్‌లోకి రావడం శుభ పరిణామం. తిలక్ వర్మ పరుగులు చేస్తున్నా.. నెమ్మదిగా చేస్తున్నాడు. ఇక బౌలర్లు ఫర్వాలేదనిపిస్తున్నారు.

**భారత తుది జట్టు (అంచనా):** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), సంజూ సామ్సన్/వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్ష్ దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి

## సాయి సుదర్శన్, దేవ్‌దత్ దూకుడు.. భారత్–ఎ 247/1




**గాలె:** భారత్–ఎ, శ్రీలంక–ఎ మధ్య రెండో అనధికార టెస్టు జరుగుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో భారత్–ఎ 247/1 పరుగులు చేసింది. 119 పరుగులు వెనకబడి ఉంది. సాయి సుదర్శన్ 104ని, దేవ్‌దత్ పడిక్కల్ 94ని క్రీజులో ఉన్నారు. అమన్ మోఖడే 38 రన్స్ చేసి కేశర నువంత బౌలింగ్‌లో ఔటయ్యాడు. అంతకు ముందు శ్రీలంక–ఎ తొలి ఇన్నింగ్స్‌లో 366 పరుగులకు ఆలౌటైంది.



## ఇన్‌స్టాగ్రామ్‌కు కేంద్రం నోటీసులు!

**న్యూఢిల్లీ :** ఇన్‌స్టాగ్రామ్‌కు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రోత్సహించేలా ఉన్న ప్రకటనలు, సైబర్ మోసాల ముప్పు దృష్ట్యా కేంద్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వివాదాస్పద ప్రకటనలపై వివరణ ఇవ్వాలని మెటా (వీమ్మ)ను కేంద్ర ఐటీ శాఖ ఆదేశించినట్లు వార్తలు వస్తున్నాయి. ఒకే వారంలో మెటాకు వరుసగా రెండుసార్లు కేంద్రం హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. వాట్సప్‌లోని యూజర్‌నేమ్ ఫీచర్ విషయంలో మెటాకు కేంద్ర ప్రభుత్వం బుధవారం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఫీచర్ వల్ల ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, నకిలీ గుర్తింపులతో ప్రజలను మోసం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని సూచించింది. అప్పటివరకు భారత పౌరులకు యూజర్‌నేమ్ ఫీచర్ రోల్‌అవుట్‌ను ఆపాలని సూచించింది. ఈ వ్యవహారంలో సంప్రదింపులు పూర్తయ్యాకనే ఈ అంశంపై ముందుకెళ్లాలని నోటీసుల్లో పేర్కొంది. కాగా, చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రోత్సహించేలా ఉన్న ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల విషయంలో మెటాకు నోటీసులు జారీ చేయాలని కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ తాజాగా అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ ప్లాట్‌ఫామ్‌పై అటువంటి ప్రకటనలు ఎందుకు చేయాల్సి వచ్చిందో అధికారులు మెటాను వివరణ కోరే అవకాశం ఉంది.

## బాంబే హైకోర్టును ఆశ్రయించిన ప్రీతిజింతా



బాలీవుడ్ ప్రముఖ నటి ప్రీతి జింతా బాంబే హైకోర్టును ఆశ్రయించింది. తన అనుమతి లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వాడి సృష్టించిన డీప్ ఫేక్ చిత్రాలు, మార్ఫింగ్ చేసిన అసభ్యకర కంటెంట్‌కు వ్యతిరేకంగా ఆమె కోర్టుకు వెళ్లింది. ఈ కంటెంట్‌ను ఇంటర్నెట్ నుండి పూర్తిగా తొలగించేలా అత్యవసర ఆదేశాలు ఇవ్వాలని ఆమె కోర్టును కోరారు. ఇక ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మాధవ్ జామదార్.. కంటెంట్‌ను వెబ్‌సైట్ల నుండి తొలగించడానికి ఒక సులువైన విధానాన్ని రూపొందించాలని ఇరు పక్షాలకు సూచించింది. కాగా దీనిపై తదుపరి విచారణ జూలై 6న జరగనుంది. ప్రీతి జింతా దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో గూగుల్, మెటా వంటి సోషల్ మీడియా సంస్థలతో పాటు డొమైన్ నేమ్ రిజిస్ట్రార్లను ప్రతివాదులుగా చేర్చారు.

## మా ఇంటి బంగారం ఓ మంచి సినిమా

### సమంతకు కంగ్రాట్స్ చెప్పిన లెనిన్ అఖిల్




అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. ఈ సినిమా జులై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు అఖిల్. ఇక చిత్ర ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ తాజా ఇంటర్వ్యూలో ఆయన టాలీవుడ్ రీసెంట్ ఇండస్ట్రీ హిట్ 'మా ఇంటి బంగారం' సినిమా గురించి అందులో సమంత నటన గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'లెనిన్' ప్రమోషన్స్ బిజీ వల్ల తాను ఇంకా 'మా ఇంటి బంగారం' సినిమా చూడలేదని, కానీ ఆ చిత్ర ట్రైలర్ చూశానని అఖిల్ వెల్లడించారు. ట్రైలర్ వైబ్ అద్భుతంగా ఉందని, చూసినప్పుడే ఇది కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని తనకు అనిపించిందని చెప్పారు. ఒక మంచి ఇంటికి కోడలిగా వెళ్లి, ఆ కుటుంబ సభ్యులందరితో బంగారం అనిపించుకోవాలనే చక్కటి ఫ్యామిలీ ఎలిమెంట్‌కు పవర్‌ఫుల్ యాక్షన్‌ను జోడించి సినిమాను చాలా కొత్త కాన్సెప్ట్‌తో, సహజంగా తెరకెక్కించారని ఆయన ప్రశంసించారు. ముఖ్యంగా ఒక మహిళా ప్రధాన పాత్రతో ఆ స్థాయి యాక్షన్ సీన్స్ చేయించడం నిజంగా అద్భుతమని కొనియాడారు. ఈ చిత్రంలో సమంత పాత్రను అద్భుతంగా పండించిందని మెచ్చుకుంటూ, కంగ్రాట్స్ సామ్ అంటూ సమంతతో పాటు 'మా ఇంటి బంగారం' చిత్రబృందానికి అఖిల్ తన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.




# హంగులతో బంధించే..

# నాగబంధం!




**రివ్యూ**

1960 దశకంలో సాగే కథ ఇది. పురావస్తు శాస్త్రవేత్త ప్రభాకర్ (జగపతిబాబు)తోపాటుగా పరిశోధనలు చేసే ఇద్దరు స్కాలర్లు అబ్దాలీ (రిషబ్ సాహ్నీ) , టెస్లా కలిసి హిమాలయాల్లో నాగబంధం విముక్తికి సంబంధించిన ఓ రహస్య పుస్తకాన్ని కనుక్కుంటారు. ఆ ఇద్దరిలో టెస్లా ఆ పుస్తకాన్ని ప్రభుత్వానికి అందజేయడానికి ప్రయత్నిస్తే, అబ్దాలీ మాత్రం తన స్వార్థం కోసం తనే సొంతం చేసుకోవాలనుకుంటాడు. నాగబంధం విముక్తిలో శ్రీ రంగనాథ స్వామి నాభిపై అలంకరించిన బ్రహ్మకమలం కీలకమని తెలుసుకుంటాడు అబ్దాలీ. దాన్ని చేజిక్కించుకుని, కాలవృక్షం బంధనంలో ఉన్న భైరాగి (గరుడ రామ్)తో కలిసి బ్రహ్మాండాన్ని శాసించాలనేది అబ్దాలీ ప్లాన్. ఆ ప్రయత్నంలో భాగంగా ఎన్నో అరాచకాలకు పాల్పడతారు. ఓ గూడెంలో జీవనం సాగిస్తున్న రుద్ర (విరాట్‌కర్ణ) కుటుంబం మొత్తాన్నీ అంతం చేస్తారు. మరి ఆ రాక్షసులు బ్రహ్మకమలాన్ని చేజిక్కించుకున్నారా? అసలు రుద్ర కుటుంబం వరకూ వాళ్లు ఎందుకు రావల్సి వచ్చింది? అధర్మం మితిమీరినప్పుడు ధర్మరక్షణ కోసం రుద్ర ఏం చేశాడు? 17వ శతాబ్దంలోని నాగసాధువు శివకీ, రుద్రకీ మధ్య సంబంధం ఏమిటి? రుద్ర జీవితంలోకి వచ్చిన పార్వతి (నభా నటేశ్) ఎవరు? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

### ఎలా ఉందంటే...

పురాణాలు, సనాతన ధర్మం, థియేట్రికల్‌గా ప్రత్యేకమైన అనుభవాన్ని పంచే విజువల్ హంగులు... ఇలా ఈ మధ్య వాణిజ్యం పరంగా ప్రభావం చూపిస్తున్న అంశాలన్నిటీని ఓ జాబితాగా రాసుకుని, వాటి చుట్టూ ఓ కథ అల్లుకుని సినిమా చేస్తే ఎలా ఉంటుందో 'నాగబంధం' అచ్చంగా అలాగే ఉంది. విజువల్స్ కోసమైనా చూడాలనిపించేలా ఈ సినిమా ట్రైలర్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఆ అంచనాలకు తగ్గట్టే విజువల్‌గా ప్రేక్షకులకు సంతృప్తినిస్తుందీ చిత్రం. సినిమా ఆరంభం నుంచి చివరి వరకూ ప్రతి ఐదు, పది నిమిషాలకీ ఓ కొత్త రకమైన ఫ్రేమ్ తెరపై కనిపిస్తూ కనువిందు చేస్తుంది. కెమెరా పనితనం, వీఎఫ్ఎక్స్‌లో ప్రమాణాలు సినిమాకి బలం. యాక్షన్ సన్నివేశాలూ ఆకట్టుకుంటాయి. అయితే కొన్ని కథలు, వాటి స్థాయి, పాత్రలే లార్జర్ దేన్ లైఫ్ తరహా హంగుల్ని డిమాండ్ చేస్తాయి. కానీ, ఇక్కడ కేవలం హంగుల కోసమే ఓ సినిమా అన్నట్టుగా ఉంటుంది. బలమైన కథ కానీ, భావోద్వేగాల్ని రేకెత్తించే భావోద్వేగాలు లేకుండానే సినిమా సాగిపోతుంది.

ఆరంభ సన్నివేశాలతోనే ప్రేక్షకుడిని కథా ప్రపంచంలో లీనం చేశాడు దర్శకుడు. హిమాలయాల్లో పుస్తకాన్ని కనుక్కోవడం, దాన్ని చుట్టూ సంఘర్షణ, ఆ తర్వాత కథానాయకుడి ప్రపంచాన్ని పరిచయం చేయడం, కుటుంబం నేపథ్యంలో డ్రామా తదితర సన్నివేశాలన్నీ ఆసక్తికరంగానే సాగుతాయి. ఆ తర్వాత కథ మరో మలుపు తీసుకుంటుంది. విలన్ గ్యాంగ్‌తోపాటుగా హీరో భైరవకోనకు వెళ్లాలని నిర్ణయించుకోవడం, అక్కడ అవసరం లేకుండానే 'ఎంత కష్టమైనా బ్రహ్మకమలాన్ని నేను తీసుకొస్తా' అని హీరో సాహసాలకు పూనుకోవడంలాంటి విషయాలు సినిమా డ్రామా మోతాదును తగ్గించాయి. మధ్య మధ్యలో అనుకోకుండా వచ్చే పాటలు కాస్త ఇబ్బంది పెడతాయి. విరామ సన్నివేశాలకు ముందు ఫైట్ ఎపిసోడ్‌తో సినిమా కాస్త గాడినపడినట్టు అనిపిస్తుంది. అయితే అప్పటికే నిడివి, సుదీర్ఘమైన యాక్షన్ ఎపిసోడ్ కారణంగా పతాక సన్నివేశాల్ని చూసేశామేమో అనే అనుభూతి కలుగుతుంది. ద్వితీయార్ధం ఆరంభంలో హీరోయిన్ చెప్పే కథ కాస్త డ్రామాని పండించినా, ఆ తర్వాత మళ్లీ మామూలే. ఓ సన్నివేశం తర్వాత కథ అనూహ్యంగా 17వ శతాబ్దంలోకి వెళుతుంది. ఆ ఎపిసోడ్‌లోనూ బ్రహ్మకమలం కథే. అదే విలన్, అవే దురాగతాలే తప్ప కథ పరంగా కొత్తగా జరిగేదేమీ ఉండదు. హీరో పాత్ర కూడా గెటప్ మారుతుందంతే. అధర్మం మితిమీరినప్పుడు ధర్మ పరిరక్షణ జరుగుతుందని చెబుతూ, సనాతన ధర్మం విశిష్టతని వివరిస్తూ సినిమాని ముగించాడు దర్శకుడు. నాగబంధం నుంచి విముక్తి కలిగితే ఏం జరుగుతుంది? బ్రహ్మాండాన్ని శాసించడం అంటే ఏమిటో లోతుగా చెప్పాల్సింది. అవేవీ చెప్పకుండా మరోభాగం కోసం ఎదురు చూడండంటూ శుభం కార్డు వేశారు.

### ఎవరెలా చేశారంటే..

రెండు కోణాల్లో సాగే పాత్రలో కనిపించాడు విరాట్‌కర్ణ. రెండు పాత్రల మధ్య చెప్పుకోదగ్గ వైవిధ్యం పెద్దగా లేకపోయినా, ఆ గెటప్పులు మాత్రం బాగా నప్పాయి. ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధంలో ఆయన నటన మెప్పిస్తుంది. యాక్షన్ సన్నివేశాల్లోనూ మెరిశారు. ముఖ్యంగా విరామానికి ముందు వచ్చే యాక్షన్ ఎపిసోడ్, పతాక సన్నివేశాలు చాలా బాగున్నాయి. కథానాయికల్లో నభా నటేశ్‌కు ప్రాధాన్యమున్న పాత్ర దక్కింది. మరో ఇద్దరు కథానాయికలు దక్ష, శ్వేతా మేనన్ ఉన్నా వాళ్ల పాత్రల పరిధి తక్కువే. నభా కథని మలుపు తిప్పే పాత్రలో కనిపించడంతోపాటు, ఆమెకు నటించే ఆస్కారం కూడా ఎక్కువే దొరికింది. ప్రతినాయకుడిగా రిషబ్ సాహ్నీ ఆకట్టుకున్నాడు. భైరాగి పాత్రలో గరుడ రామ్ పరిచయమయ్యే విధానం, ఆ తర్వాత ఆయన గెటప్పు ఆసక్తిని రేకెత్తిస్తాయి. ఫస్ట్ హాఫ్‌పై అనసూయ, సోనియా సింగ్, శరణ్య, అంకిత్ కొయ్య పాత్రలు ప్రభావం చూపిస్తాయి. మురళీశర్మ, మహేశ్ మంజ్రేకర్ తదితరుల పాత్రలు సెకండాఫ్‌లో కీలకం. సాంకేతిక విభాగాలే సినిమాకి ప్రధానబలం. సౌందర్‌రాజన్ సినిమాటోగ్రఫీ మెప్పిస్తుంది. జునైద్‌కుమార్, అభిల సంగీతం బాగుంది. 'నమోరే..' పెళ్లి పాట చిత్రణ మరింత గ్రాండియర్‌గా ఉంది. అశోక్ కళా ప్రతిభ అడుగడుగునా కట్టిపడేస్తుంది. శ్రీరంగపురం దేవాలయం మొదలుకొని ద్వితీయార్ధంలో కనిపించే విరాట పురుషాలయం వరకూ ప్రతి సెట్ భారీదనంతో కట్టిపడేస్తుంది. సినిమాలో అడుగడుగునా పాముల విజువల్స్ కనిపిస్తుంటాయి. జగపతిబాబు హెలికాప్టర్ కూలిపోయే సన్నివేశం మినహా విజువల్ ఎఫెక్ట్స్ ఎంతో సహజంగా కుదిరాయి. నిడివి సినిమాకి మైనస్. దర్శకుడు అన్ని విభాగాల్నీ సమర్థంగా నడిపిస్తూ, అనుకున్న కథని ఆత్మవిశ్వాసంతో తెరకెక్కించినా రచనలోనే ఇంకాస్త పదును, బలమైన ఎమోషన్స్ చేర్చి ఉంటే మరోస్థాయిలో ఉండేది. నిర్మాణ విలువలు సినిమాకి హైలైట్.



## సముద్ర తీరంలో మాళవిక మోహనన్ గ్లామర్ షో

మాళవిక మోహనన్ గురించి సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. తమిళ్, మలయాళం, హిందీ, తెలుగు చిత్రాల్లో నటిస్తూ ఆమె మంచి గుర్తింపును సంపాదించుకుంది. ప్రముఖ ఛాయాగ్రాహకుడు కె.యూ. మోహనన్ కుమార్తె అయిన మాళవిక, 2013లో విడుదలైన మలయాళ చిత్రం 'పట్టం పోల్' ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టింది. అనంతరం రజనీకాంత్ హీరోగా నటించిన 'పెట్టా', విజయ్ హీరోగా తెరకెక్కిన 'మాస్టర్' చిత్రాలతో విశేష గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'ది రాజా సాబ్' చిత్రంలో హీరోయిన్‌గా నటించి తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైంది. సినిమాల్లో తన అందం, అభినయంతో ఆకట్టుకునే మాళవిక సోషల్ మీడియాలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. తాజాగా సముద్ర తీరంలో స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో దిగిన ఫొటోలను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అభిమానులతో పంచుకుంది. విభిన్న యాంగిల్స్‌లో ఇచ్చిన పోజులు ఆమె లుక్‌ను మరింత ఆకర్షణీయంగా నిలిపాయి. ముఖంపై అందంగా జారిన కురులు, చేతికి ధరించిన గాజులు, ట్రెండీ స్టైలింగ్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేశాయి. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల నుంచి విశేష స్పందనను అందుకుంటున్నాయి.

## హృత్రిక్, సుసానే విడాకులు

### భరణంగా 400 కోట్లు అంటూ వైరల్



హృతిక్ రోషన్, సుసానే ఖాన్ విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే.. విడాకుల తర్వాత సుసానే రూ.400 కోట్ల భరణం డిమాండ్ చేశారనే వార్తలు వైరల్ అయ్యాయి. వాటిపై ఆమె సోదరి ఫరాఖాన్ తాజాగా స్పందించారు. ఈ విడాకులు ఇరువర్గాల అంగీకారంతోనే జరిగాయని.. ఇప్పటికీ రెండు కుటుంబాల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. హృతిక్ సుసానే విడాకులపై సోషల్ మీడియాలో, బయటా పెద్ద రచ్చ జరిగింది. వారి వ్యక్తిగత జీవితంపై చాలా మంది రకరకాల అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కానీ, వారిద్దరూ ఆ క్లిష్ట పరిస్థితిని ఎంతో గౌరవప్రదంగా, హుందాగా ఎదుర్కొన్నారు. ఇక.. సుసానే రూ.400 కోట్ల భరణం తీసుకున్నారన్న వార్తల్లో నిజం లేదు. భరణం తీసుకుని ఆమె మరింత ధనవంతురాలయ్యారని కామెంట్స్ చేస్తున్నారు. అవి చూసి నా మనసు ఎంతో బాధపడుతోంది. ఆ వార్తలు పచ్చి అబద్ధం అని స్పష్టం చేశారు. దీంతో ఈ వార్తలకు బ్రేక్ పడింది. హృతిక్ రోషన్, సుసానే ఖాన్ డిసెంబర్ 2014లో అధికారికంగా విడాకులు తీసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు (రెహాన్, హ్రిదాన్) ఉన్నారు. విడాకులు తీసుకున్నప్పటికీ.. తాము మంచి స్నేహితులుగా ఉంటూ తమ పిల్లల బాధ్యతలను చూసుకుంటున్నట్లు హృతిక్ తెలిపారు.

## ఆసక్తికరంగా సాగిన రావు బహదూర్

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' లాంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు వెంకటేశ్ మహా. ఇప్పుడాయన సత్యదేవ్‌తో కలిసి చేసిన ప్రయోగాత్మక చిత్రం 'రావు బహదూర్'. దీనికి మహేశ్‌బాబు స్వయంగా సమర్పకుడిగా వ్యవహరించడం.. ఇందులో సత్యదేవ్ భిన్న గెటప్పుల్లో కనిపించనుండటం.. టీజర్, ట్రైలర్లు ఆసక్తిరేకెత్తించేలా ఉండటంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై మంచి అంచనాలేర్పడ్డాయి. 1968 – 1991 మధ్య కాలంలో సాగే కథ ఇది. రామప్ప రావు బహదూర్ (సత్యదేవ్) ఓ రాజవంశీకుడు. కాలేయ క్యాన్సర్‌తో పోరాడుతూ జీవిత చరమాంకంలో ఉంటాడు. అతను కొన్ని నెలలకు మించి బతకడని డాక్టర్లు చెప్పినప్పటికీ.. వాళ్ల అంచనాల్ని తలకిందులు చేస్తూ నిక్షేపంగా జీవిస్తుంటాడు. అయితే, తీవ్రమైన మానసిక రుగ్మతలతో సతమతమవుతుంటాడు. ముఖ్యంగా అతన్ని ఓ అనుమానం పెనుభూతంలా పట్టిపీడిస్తుంటుంది. దాన్ని తీరిస్తే చాలు.. సంతోషంగా ప్రాణం వదిలేస్తానని తన మిత్రుడు, వ్యక్తిగత వైద్యుడు ఆచారి (వికాస్ ముప్పాల) దగ్గర మాట తీసుకుంటాడు. మరి అతనికున్న ఆ అనుమానమేంటి? దానివల్ల అతని చుట్టూ ఉన్న వాళ్లని ఎన్ని రకాలుగా ముప్పుతిప్పలు పెట్టాడు? అసలు రామప్ప గతమేంటి? రేణుక (దీపా థామస్)తో ప్రేమ, పెళ్లి ప్రయాణం ఎలా సాగింది? ఆమెకి దూరంగా రామప్ప ఒంటరిగా జీవించడానికి వెనకున్న కారణమేంటి? అన్నది సినిమా కథ. ఇదొక విభిన్నమైన సైకలాజికల్ డ్రామా. జీవిత చరమాంకంలో ఉన్న ఓ




రాజవంశీకుడు తనకున్న అనుమానం అనే జబ్బుతో చుట్టూ ఉన్న వాళ్లని సైకలాజికల్‌గా ఆడుకుంటూ తన కోరికని ఎలా నెరవేర్చుకున్నాడన్నది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. పైకిది ఓ రాజవంశ కథలా కనిపించినా.. అంతర్లీనంగా సమాజంలో తరతరాలుగా గూడుకట్టుకుపోయిన వివక్షాపూరిత వ్యక్తిత్వాల గురించి చర్చిస్తుంది. ప్రధానంగా కుల వ్యవస్థ, రంగు, రక్తసంబంధాలు, వారసత్వ హోదాపై ఉన్న పిచ్చిని ఈ చిత్రం బలంగా ప్రశ్నిస్తుంది. కానీ, ఈ సినిమాతో దర్శకుడు వెంకటేశ్ మహా చెప్పాలనుకున్న విషయం ఆలోచన రేకెత్తించేదే అయినా.. దాన్ని ఆద్యంతం జనరంజకంగా మలచడంలో అక్కడక్కడా తడబడ్డారు. ఓ ఫొటో ఫ్రేమ్ నుంచి బయటకొచ్చిన పిల్లాడిని ఊడలు తరుముకుంటూ రావడం.. తనని తిరిగి సమాధిలో బంధించడం.. కట్ చేస్తే మంచం పట్టిన స్థితిలో వృద్ధ పాత్రలో హీరోని పరిచయం చేయడం.. ఇలా ఆరంభ సన్నివేశాలు ఏదో కొత్త కథని, కొత్త ప్రపంచాన్ని చూడబోతున్నామన్న ఆసక్తిని కలిగించేలా చేస్తాయి. కానీ, సినిమాలో వేగం కనిపించదు. ప్రేక్షకుడికి అసలు కథేంటన్నది అంతుచిక్కడానికి విరామం వరకు వేచి చూడాల్సి వస్తుంది. భువనాలయ ప్రపంచం.. అందులోని రావు బహదూర్ జీవితం.. అతని గతం.. రేణుకతో ప్రేమాయణం అన్నీ నెమ్మదిగా సాగిపోతుంటాయి. హీరో ఎప్పుడైతే తన అనుమానం తీర్చుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెడతాడో అక్కడి నుంచే కథలో సంఘర్షణ రెట్టింపవుతుంది. ఈ క్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచేలా ఉంటాయి. ఇక సెకండాఫ్ మొదలైనప్పటి నుంచి కథ కాస్త గాడిన పడిన అనుభూతి కలుగుతుంది. హీరో గతం.. చిన్న కొడుకుపై వివక్ష చూపించడానికి వెనకున్న కారణం.. దాని చుట్టూ నడిపిన డ్రామా అన్నీ ఆకట్టుకుంటాయి. ఇక ఈ కథలోకి పోలీస్ పాత్ర ఎప్పుడైతే ఎంట్రీ ఇస్తుందో.. అక్కడి నుంచి సినిమా ఇంకాస్త ఆసక్తికరంగా మారుతుంది. ఓ చక్కటి ట్విస్ట్‌తో పతాక ఘట్టాల్ని తీర్చిదిద్దిన తీరు ఆకట్టుకుంటుంది.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com